

యడ్లపాడు : జాలాది వద్ద వరద ముంపునకు గురై మాడిపోయిన వరిపైరు

తడిస్తే.. తీసుకోం



- కొనుగోళ్లలో సీసీఐ మడత పేచీ
- 8 నుంచి 12 శాతం తేమ ఉండాలని ప్రకటన
- వర్షాలతో విపత్కర పరిస్థితి..దిక్కుతోచని స్థితిలో రైతులు

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

పత్తి కొనుగోలుపై సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మడత పేచీలు మొదలు పెట్టింది. నిబంధనల ప్రకారం తేమ శాతం ఉంటేనే కొనుగోలు చేస్తామని ప్రకటించింది. తుఫాన్ ప్రభావంతో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో కురిసిన భారీ వర్షాలు



అచ్చంపేట : కోగంటివారిపాలెంలోని పత్తి చేను పరిస్థితి

వ్యాపారుల దోపిడీ..

ఈ ఏడాది పత్తికి సీసీఐ మద్దతు ధర ప్రకటించింది. క్వింటా రూ.8,110(మొదటి శ్రేణి నాణ్యత), దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర నిర్ణయించారు. ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాల్లో పెద్దగా కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాలేదు. దీంతో బయట వ్యాపారులు క్వింటా పత్తి కేవలం రూ.5 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు.

రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ తరుణంలో కొనుగోలు చేసే పత్తిలో తేమ శాతం 8 నుంచి 12 వరకు ఉండాలన్న సీసీఐ ప్రకటనపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మొంథా తుఫాన్‌తో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు పొలాలను వరదలు ముంచెత్తాయి. మొంథా పత్తి రైతులను ముంచేసింది. గుంటూరు జిల్లాలో 59,140 ఎకరాల్లో, పల్నాడు జిల్లాలో 2,27,180 ఎకరాల్లో, బాపట్ల జిల్లాలో సుమారు 5 వేల (మిగతా 6వ పేజీలో)

మొంథా పోయి.. వరద వచ్చె

మొంథా ధాటికి మూడు రోజులు జిల్లావాసులు వణికిపోయారు. తుఫాన్ తప్పింది.. ఎండ వచ్చింది.. అని ఊపిరిపీల్చుకుంటున్న తరుణంలో వరద ముప్పు ముంచుకోస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణమ్మ పోటెత్తి ప్రవహిస్తోంది. నది లో అంతకంతకూ వరద ఉధృతి పెరుగుతోంది. దీంతో మళ్లీ నదీ తీరప్రాంతవాసులకు వరద ముప్పు తప్పడంలేదు. ఇప్పటికే ప్రభుత్వం కృష్ణా నదీతీర ప్రాంతవాసులు జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరికలు జారీ చేసింది. నదీ పరివాహక ప్రాంతం వెంబడి గ్రామాల్లో అధికారులను అప్రమత్తంగా చేసింది. నిన్నటి వరకు తుఫాన్‌తో వరుణుడు ప్రకోపించి పెనుగాలులతో విరుచుకుపడితే, ఇప్పుడు కృష్ణమ్మ ఉగ్ర రూపం దాల్చుతోందని ప్రజలు, రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణానదిలో పోటెత్తుతోన్న ప్రవాహం

- తుఫాన్ పోయిందని ఊపిరి పీల్చుకునేలోపే ముప్పు
- నదీతీరప్రాంతవాసులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బ్యారేజి నుంచి దిగువకు 5.82 లక్షల క్యూసెక్కులు విడుదల



ప్రకాశం బ్యారేజి వద్ద పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

ప్రవాహం ఇలా..

- శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టులో 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు.
- పులిచింతల నుంచి గురువారం ఉదయం 6 గంటలకు 4.84 లక్షల క్యూ సెక్కుల వరద నీరు బ్యారేజికి వదిలారు. సాయంత్రానికి 1.51 లక్షల క్యూసెక్కులకి తగ్గించారు.
- కీసర వాగు, మునేరు నుంచి 1.49 లక్షలు, పాలేరు నుంచి 23,967 క్యూసెక్కుల వరద వచ్చి నదిలో చేరుతోంది.
- ప్రకాశం బ్యారేజి నుంచి 1.49 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు వదిలారు. అది క్రమంగా పెరుగుతూ రావడంతో మధ్యాహ్నానికి 3.82 లక్షలకు, రాత్రికి 5,82,710 క్యూసెక్కులకు పెరిగింది. 69 గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలేస్తున్నారు.

తెనాలి , అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గడచిన వారం రోజులుగా ఇటు జనం కానీ, అటు అధికారులు విరామం లేకుండా తుపాన్ ముప్పును ఎదుర్కొనేందుకు శ్రమించా రు. బుధవారం వాన విరామం తీసుకుంది. గురు వారం ఎండ విరగకాసింది. ఇక వర్షాల నుంచి తేరుకోవచ్చని అటు రైతులు, ఇటు ముంపు ప్రాంతాల ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో కృష్ణా నదికి వరద తరుముకొచ్చింది. నదిపై ఉన్న జలాశయాలకు ఎగువున కూడా వర్షాలు పడుతుండటం వరదకి కారణమైంది. మొంథా తుఫాన్ తీరం దాటే సమయంలో తెలంగాణలో అత్యంత భారీ వర్షాలు కురిసాయి. దీంతో ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలతో వరద నీరు మునే రు నుంచి కీసర ద్వారా ప్రకాశం బ్యారేజికి చేరుతోంది. అటు పల్నాడు జిల్లాలో కురిసిన వర్షాలకు అక్కడా వాగులు పొంగుతుండడంతో నది లో వరద ప్రవాహం పెరిగింది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు, పులిచింతల నుంచి బ్యారేజికి వదులుతున్న నీటి (మిగతా 6పేజీలో)



పిడుగురాళ్ల: పిన్నెల్లి - లక్ష్మీపురం రహదారిలో కొట్టుకుపోయిన కల్వర్టు

రెండో ప్రమాద హెచ్చరిక జారీ

ప్రకాశం బ్యారేజికి భారీగా వరద వచ్చి చేరుతుండటంతో ప్రస్తుతం 15 అడుగుల మేర నీటి మట్టం కొనసాగుతోంది. గురు వారం మధ్యాహ్నానికే వరద ప్రవాహస్థాయి 3.9 లక్షల క్యూసెక్కులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరికను ప్రకటించారు. గురువారం రాత్రికి 5,82,710 క్యూసెక్కుల స్థాయి పెరిగింది. దీంతో బ్యారేజి వద్ద 2వ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు.



నరసరావుపేట : పంటలను పరిశీలిస్తున్న జేడీ జగ్గారావు



పత్తి కాయలో మొలకలు

చెరువులో ఇళ్లు

- కొనసాగుతున్న అనధికార నిర్మాణాలు
- ముంపులో కాలనీలు.. పట్టించుకోని అధికారులు

పిడుగురాళ్ల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని చెరువు భూమిలో రోజురోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. దీంతో వర్షాలకు కురిసిన నీరంతా సమీప కాలనీలను ముంచెత్తుతోంది. తాజాగా కురిసిన వర్షాలతో కాలనీలు నీటమునిగి ఆ ప్రాంతవాసులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నా.. అధికారులు ఆక్రమణల గురించి పట్టించు కోవడం లేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇతర సర్వే నెంబర్లతో చెరువు భూమిని రిజిష్టర్ చేయించుకుని ఇళ్లు నిర్మించుకున్నారు. చెరువు భూమిలో సుమారు 2 ఎకరాలకు పైగా అనధికార గృహ నిర్మాణాలు వెలిశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా చెరువు భూమిలో కొందరు అనధికార కట్టడాలకు తెరతీశారు. చెరువు భూమిలో నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని ఎమ్మెల్యే యరపతినేని అధికారులకు సూచించినా కొందరు దళారులు నాలుగైదు నెలలుగా అధికారుల కళ్లుగప్పి అక్కడక్కడ గృహ నిర్మాణాలు చేపట్టారు. చెరువు భూమిలో సుమారు 60కి పైగా అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. ఉన్నతాధికారుల సూచనలతో వాటిని తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు.

చెరువు భూమిలో కొనసాగుతున్న అనధికార కట్టడాలు



కొల్లూరు : తుఫాన్ గాలులకు లంక గ్రామాల్లో వాలిపోయిన అరటి చేలు





నాదెండ్ల మండలం తిమ్మాపురం వద్ద కొట్టుకు పోయిన రహదారి

ముంచేసింది..

- పంటలకు రూ.90 కోట్లకుపైగా నష్టం
- జిల్లాలో 55,935 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు
- అంచనా లెక్కల్లో వ్యవసాయ, ఉద్యానశాఖలు
- కొట్టుకుపోయిన రహదారులు, కల్వర్టులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మొంథా రైతులను నిండా ముంచేసింది. జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలతో పొలాలు మునకేశాయి. దీంతో పంటలకు అపార నష్టం వాటిల్లింది. దీంతో పంటలు వర్షార్పణంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వాగులు ఉధృతికి చాలాచోట్ల రోడ్లు, కల్వర్టులు కొట్టుకు పోయాయి. జిల్లాలో అన్ని రకాల పంటలు 55,935 ఎకరాల్లో మునిగిపోగా రైతులకు రూ.90 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అధికారులు అంచనా వేశారు. పూర్తిస్థాయి పంట నష్టం ఇంకా పెరిగే అవకాశాలు ఉన్నాయి. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు నష్టం అంచనాలో నిమగ్నమయ్యారు. కాగా ఇప్పటి వరకు చూస్తే అత్యధికంగా 43,750 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లింది. పత్తి తీయాల్సిన తరుణంలో వర్షాలతో మొక్కలకే పత్తి తడచిముద్దయింది. ఎడతెరిపి లేని వర్షాలతో కాయలు కుళ్లిపోతున్నాయి. పూత రాలిపోయింది. ఎకరాకు నాలుగు తీతలకు 8 నుంచి 12 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని ఆశించగా ఒక కాపు పూర్తిగా పోయినట్లేనని రైతులు వాపోతున్నారు. చెలో నీరు నిలవడంతో ఉరకెత్తి కాపు దెబ్బతింటోంది. ఎకరాకు రెండు కింటాళ్ల చొప్పున నష్టం అంచనా వేస్తే దాదాపు రూ.70.80 కోట్లు నష్ట వాటిల్లినట్లు. అయితే ఈ నష్టం ఇంకా ఎక్కువగానే ఉంటుందని రైతులు తెలిపారు. నీటిలో వరి కంకి నానుతుండటంతో గింజరాలిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2,500 ఎకరాల్లో వరి, 875 ఎకరాల్లో మొక్కజొన్న, 450 ఎకరాల్లో కంది, 200 ఎకరాల్లో మినుము, 200 ఎకరాల్లో జూట్ దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ లెక్కకట్టింది. వరి ఇతర పంటల నష్టం రూ.10 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

- మిరప, కూరగాయలు, బొప్పాయి, అరటి పంటలు 5,208 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు ఉద్యానశాఖ అంచనా వేసింది. రూ.12.85 కోట్లు నష్టం ఉంటుందని అంచనా.
- విద్యుత్ శాఖకు రూ.91 లక్షలు నష్టం వాటిల్లినట్లు ఎస్‌ఈ డాక్టర్ పత్తిపాటి విజయకుమార్ తెలిపారు. 153 విద్యుత్ స్తంభాలు కూలిపోగా 44 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు.
- జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులు 324 కిమీ మేర దెబ్బ తిన్నట్లు అధికారులు నివేదిక సిద్ధం చేశారు. రూ.22 కోట్లు నష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. 15 చోట్ల రోడ్లకు గండ్లు పడగా 19 చోట్ల కల్వర్టులు కొట్టుకుపోయాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో రూ.2.70 కోట్లు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వానికి అధికారులు నివేదిక పంపారు.



నరసరావుపేట వద్ద నీటిలోనే నానుతున్న మిరప చేను

నష్టంపై నివేదికలు సిద్ధం చేయాలి

క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలి • అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

నరసరావుపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుపాను నష్టపరిహారం నివేదికలను త్వరగా సిద్ధం చేయాలని కలెక్టర్ కృతికాశుక్లా అధికారులను గురువారం ఆదేశించారు. బాధితులకు సత్వరం పరిహారం అందించడానికి అధికారులు క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలన్నా రు. విద్యుత్, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ఆ నివేది కలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధులు మంజూరుకి కృషి చేస్తామన్నారు. ఎన్ని చెరువులకు, రోడ్లకు ఎంతమేర మరమ్మతులు చేపట్టాలో తేల్చాలన్నారు.



మత్స్యకార సంఘాలకు చెరువుల లీజు

మైనర్ ఇరిగేషన్ చెరువులను మత్స్యకార సహకార సంఘాలకు కనిష్ఠ ధరలకు లీజుకి ఇస్తామని కలెక్టర్ తెలిపారు. మత్స్యశాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ వివిధ పథకాలపై చర్చించారు. 3,300 ఎకరాల్లో చేపలు, రొయ్యల పెంపకం దారులకు లైసెన్సులు మంజూరు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తామన్నారు. మంచినీటిలో వేట చేసుకునే 1,500 మంది మత్స్యకారులకు లైసెన్సులు ఇస్తామన్నారు. 1.50 పైసలకే విద్యుత్తు సరఫరా చేస్తామన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో సబ్సిడీలను అందిస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి సంజీవరావు తెలిపారు.

హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ

● రూ.4.37 లక్షల నగదు మాయం

పెదకాకాని, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెదకాకాని రోడ్డులోని హార్స్ రేసింగ్ క్లబ్‌లో చోరీ ఘటనపై గురువారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల మేరకు.. రెండు రోజుల క్రితం క్లబ్‌కు నిర్వాహకులు తాళాలు వేశారు. బుధవారం యథావిధిగా క్లబ్ తాళాలు తీసి.. ప్రారంభించారు. అయితే కౌంటర్‌లో ఉంచిన రూ.4.37లక్షల నగదు కనిపించ లేదు. సొత్తు చోరీకి గురైందని గ్రహించి.. అక్కడ పనిచేస్తున్న గూంటూరు మహిళ తుమ్మ నాగలత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపడుతున్నారు.

34,969 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 36,611 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 34,969 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,681 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	12500
334	10000	15200	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14200	334	10500	15000
273	---	----	నెంబరు. 5	10000	14500
341	10000	15800	273	----	---
4884	----	----	341	10000	16000
సూపర్ 10	10000	14500	సూపర్ 10	11000	14700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15000	తేజ	10000	14800
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	15300
బ్యాడిగి	10500	15000	దేవనూరు డీలక్స్	10500	14200
దేవనూరు డీలక్స్	10000	14500	తాలుకాయలు	5000	7800

రైతులను కేంద్రం ఆదుకోవాలి

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

నాదెండ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో రాష్ట్ర వ్యాప్తంగా నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కోరారు. ఇర్లపాడు, ఎండుగుంపాలెం, కోమటినేనివారిపాలెం గ్రామాల పరిధిలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను గురువారం ఆయన పరిశీలించారు. అవిశాయపాలెం పునరావాస కేంద్రంలో ఉన్న తుఫాన్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయం, నిత్యావసరాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ రైతులు మళ్లీ సాగు చేపట్టాలంటే పెట్టుబడిలో సగం కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో అందిస్తేనే సాధ్యమవుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌లు కేంద్రాన్ని సంప్రదించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం హయాంలో వాగుల్లో పూడిక తీయక పోవడంతో వరద నీరు పొలాలు, జనావాసాలను ముంచెత్తిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాగులు, కాలువల్లో పూడిక తీత పనులపై ప్రభుత్వం దృష్టి పెడితే భవిష్యత్తులో సమస్య ఉండదన్నారు. ఆయన వెంట మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, జనసేన నేత రాజా రమేష్, తహసీల్దార్ కుటుంబరావు, సర్పంచ్ సామినేని లలిత నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఉన్నారు.



ఆర్థిక సాయం, నిత్యావసరాలు అందిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

తడిస్తే.. తీసుకోం

(5వ పేజీ తరువాయి)

ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బతినింది. తీయడానికి సిద్ధంగా ఉన్న పత్తి తడిచి పోయింది. గుంటూరు జిల్లాలోనే 9308 హెక్టార్లలో, బాపట్ల జిల్లాలో బాపట్ల జిల్లాలో 2,190 ఎకరాల్లో పత్తి పంట దెబ్బ తిన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. పల్నాడు జిల్లాలో ఈ నష్టం ఐదు రెట్లు ఎక్కువగా ఉండనున్నది. తుఫాన్ ప్రభావంతో చాలా చోట్ల పత్తి పొలాలు ఎర్ర తెగులు బారినపడ్డాయి. కొన్ని చోట్ల పూర్తిగా ఉరకెత్తాయి. ఎకరాకు రూ.45 వేల నుంచి రూ.60 వేలు వరకు పెట్టుబడి పెట్టామని రైతులు చెబుతున్నారు. అవి కూడా రాని పరిస్థితి నెలకొంది. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితి ఈ విధంగా ఉంటే సీసీఐ నెమ్ము లేకపోతే మద్దతు ధర ఇస్తాం, కొనుగోలు చేస్తాం అని చెబుతుండటం రైతులను మరింత నిరాశ, నిస్పృహకు లోనవుతున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి 10 సీసీఐ కేంద్రాలు ఉండగా, తేమ శాతం సడలించాలని రైతులు పట్టుబడుతున్నారు.

తేమ నిబంధనను సడలించాలి..

వాస్తవానికి ఆంధ్రప్రదేశ్‌లో పత్తి చేతికి వచ్చే సమయానికి తుఫాన్ల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గడచిన ఐదేళ్లను ప్రాతిపదికగా తీసుకున్నా సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలల్లో తుఫాన్ల ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతింటున్నాయి. దీంతో పత్తి చేలు పూర్తిగా తడిచి తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఈ తడిచిన పత్తిని ఆరబెట్టుకునే పరిస్థితి రైతులకు ఉండటంలేదు. రైతు తాను సాగు చేసిన పత్తి నిల్వ, ఆరబెట్టడం తలకు మించిన భారమవుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు తీసిన పత్తిని తీసి నట్లు అమ్ముకుంటున్నారు. అయితే సీసీఐ మాత్రం రైతులు పత్తిని ఆరబెట్టి తీసుకువస్తే మద్దతు ధరకు కొంటామని చెబుతుంది.

ధాన్యంపై అలా.. పత్తిపై ఇలా

వాస్తవానికి తడిచిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తుంటుంది. అదేవిధంగా తడిచిన పత్తిని ప్రభుత్వం ఎందుకు కొనుగోలు చేయదన్న ప్రశ్న తలెత్తుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎంత చెప్పినా తడిచిన పత్తిని సీసీఐ కొనే పరిస్థితి లేదు. ఈ తరుణంలో ఈ ఏడాది రైతును ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్న విజ్ఞప్తి లేకపోలేదు.

మొంథా పోయి.. వరద వచ్చే

(5వ పేజీ తరువాయి)

స్థాయి కచ్చితంగా తెలుస్తున్నా, బ్యారేజి క్యాచ్‌మెంట్ ప్రాంతం నుంచి వచ్చి చేరుతోన్న వరద అంచనా లెక్కకు అందడంలేదు. దీంతో అధికారులు శుక్రవారానికి మరింతగా ఉధృతి పెరుగుతుందన్న అంచనాలో ఉన్నారు.

లంక గ్రామాల్లో మళ్లీ భయం

లంక గ్రామాలు మరోసారి భయం గుప్పిట్లోకి చేరాయి. గత వరదలకు సంబంధించి ఏర్పడిన నష్టాల నుంచి తేరుకోక ముందే వరద భయం వెంటాడుతోంది. మిగిలిన పంటలు కూడా దక్కవనే ఆవేదనను రైతులు వ్యక్తం చేస్తున్నారు. లంక గ్రామాలను ఇప్పటికే రెండు దఫాలుగా వరదలు ముంచేశాయి. అరటి మినహా, పసుపు, కంద, మినుము, కూరగాయల సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాని చవిచూశారు. నిన్నటి తుఫాన్ పెనుగాలలకు అరటి చెట్లు కూడా కుదలయ్యారు. పసుపు, కంద వంటి దుంప పంట గత నష్టాలను తట్టుకుని కొద్దిగా అయినా దిగుబడిని రైతుకు దక్కనిస్తాయనుకుంటే వరద భయం మళ్లీ వారి ఆశలపై నీళ్ల చల్లుతోంది. నదిలో వరద ఉధృతి పెరగడంతో మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం రాత్రి కొల్లిపర మండలంలోని లంక గ్రామాల్లో పర్యటించారు. తుఫాన్ ను సమర్థంగా ఎదుర్కొన్నామని, వరద విషయంలోనూ భయపడాల్సిన పనిలేదని, దీనిని కూడా అధికమిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

4 క్రస్ట్‌గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల

విజయపురిసౌత్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎగువున శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండడంతో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ అధికారులు ప్రాజెక్ట్ 4 క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటిమట్టం 590.00 అడుగులు ఉంది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 33,739, 4 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 32,400, మొత్తం ఔట్‌ఫ్లో 66,139 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 1,49,139 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.



4 క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	132, 141, 152
చికెన్ విత్ స్కిన్(కిలో)	252.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	262.00

అర్ధంతరంగా విద్యుదుత్పత్తి నిలిపి వేత

రెంటచింతల, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 10 గంటల నుంచి భారీగా వరద రావడంతో(2 లక్షల 23 వేల క్యూసెక్కుల)వివిద్యుదుత్పత్తిని అర్ధంతరంగా నిలిపి వేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 5 గేట్లను 2మీటర్ల మేరఎత్తి 41,200, టేల్ రేస్ చానల్ ద్వారా 8,500 క్యూసెక్కులు మొత్తంగా 49700 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ఎగువన సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 49,000 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా 7.080 టీఎంసీలకు సమానమన్నారు. బుధవారం రాత్రి 10 గంటల వరకు 0.9556 ఎంయూల విద్యుత్ ఉత్పత్తి చేశా రు. ఇప్పటి వరకు 62.3535 ఎంయూల విద్యుదుత్పత్తి జరిగింది.

ఏఎన్‌యూ దూరవిద్య పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూర విద్య కేంద్రం యూజీ, పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ కంచర్ల గంగాధరరావు, రెక్టార్ ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం గురువారం విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఏ తృతీయ సెమిస్టర్, ఎంబీఏ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసి.. వచ్చే నెల 12లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. యూజీ కోర్సులకు రూ. 770, పీజీ కోర్సులకు రూ.960లు ఒక పేపర్‌కు ఫీజు చెల్లించాలని తెలిపారు. దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్, డిప్యూటీ రిజిస్ట్రార్ జైనలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ గంగాధరరావు, రెక్టార్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం

SHRIRAM Finance శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

ఋణగ్రహీతలు / సహ-ఋణగ్రహీతలు / హామీదార్లు / దిగువ తెలుపబడిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి ఆర్థిక సహాయాన్ని వినియోగించుకున్నారు. ఆర్థిక సహాయాన్ని వినియోగించుకొన్నప్పటికీ, గడువు తేదిల ప్రకారం వడ్డీ మరియు అసలు మొత్తాలను తిరిగి చెల్లించుటలో అనేక సార్లు ఋణగ్రహీతలు / హామీదార్లు విఫలమైనారని మేము తెలియజేస్తున్నాము. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింద & సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3తో చదువబడు సెక్షన్ 13(2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారి సదరు ఖాతాను నిరర్థక ఆస్తిగా వర్గీకరించారు. నోటీసులు స్వీకరణ తేది నుండి 60 రోజులలోగా చెల్లింపు తేది వరకు నోటీసులో తెలిపిన మొత్తం పై కాంట్రాక్చువల్ రేటున తదుపరి వడ్డీతో పాటు నోటీసులో తెలిపిన మొత్తం మరియు అనుషంగిక ఖర్చులు, వ్యయాలు, ఛార్జీలు వగైరాలను చెల్లించవల్సిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు / హామీదార్లు / తనఖాదారులను కోరుతూ సర్ఫేసి చట్టం 2002లోని 13(2) క్రింద ఇందులో తెలిపిన సంబంధిత తేదిలలో డిమాండ్ నోటీసులు జారీచేశారు.

చివరగా తెలిసిన వారి చిరునామాలోని వారికి జారీ చేయబడిన నోటీసులు అందజేయబడకుండ తిరిగి వచ్చినందుకు సదరు విషయం గురించి బహిరంగ ప్రకటన రూపంలో వారికి సమాచారం ఇవ్వడమైనది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు లభించు సమయానికి సంబంధిత చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను గమనించవల్సిందిగా ఋణగ్రహీతలకు విజ్ఞప్తి.

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

జనవరి 23 వరకు గడువు పొడిగింపు

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్‌ను ప్రభుత్వం 2026 జనవరి 23వ తేదీ వరకు పొడిగించిందని మునిసిపల్ కమిషనర్ ఆనంద్ కుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈనెల 23వ తేదీతో గడువు ముగిసిందని, ప్రభుత్వం తిరిగి మరో అవకాశం కల్పించిందన్నారు. పురపాలక సంఘ పరిధిలో అనుమతులు లేని లేఅవుట్ యజమానులు, ప్లాట్ల కొనుగోలు, అమ్మకందారులు తప్పనిసరిగా తమ ప్లాట్లను, లేఅవుట్‌లను రెగ్యులర్ చేయించుకోవాలని ఆయన తెలిపారు.

దేవాలయానికి నూతన హంగులు

దాచేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా భట్రుపాలెం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నూతన రంగులు వేస్తున్నారు. స్వామివారి కల్యాణం, రాష్ట్రస్థాయి కబడ్డీ, క్రికెట్ పోటీలు, భారీగా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేముల బుజ్జి వివరించారు. శ్రీనగర్‌కి చెందిన ఆకూరి శ్రీనివాసరెడ్డి, కాసిరెడ్డి అన్నదమ్ములు ఆలయానికి రూ.1.50లక్షల విలువైన రంగు డబ్బాలను అందజేశారు.

రజక కాలనీకి రాకపోకల మార్గం ఏర్పాటు

పిడుగురాళ్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అధిక వర్షం కారణంగా ఆర్‌టిసి బస్టాండ్ పక్కనే వున్న రహదారి నుండి రజక కాలనీకి వెళ్లే మార్గంలో చప్టా కోతకు గురికావడంతో బుధవారం రాకపోకలు నిలిచిపోయాయి. గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఏఈ రోహిణి రజక కాలనీకి రాకపోకల మార్గాన్ని తాత్కాలికంగా ఏర్పాటుచేశారు.

పంట పొలాలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

గుత్తికొండ సమీపంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన అధిక వర్షాలకు నీటమునిగిన వరిపొలాలను మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పరిశీలించారు. పార్టీ నాయకులు, రైతులతో కలిసి పంటపొలాలను పరిశీలించిన కాసు మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఎనిమిది మంది జూదరుల అరెస్టు

మాచవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మాచవరంలో పేకాడుతున్న 8మంది వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. మాచవరంలోని సినిమాహాల్ సెంటర్ సమీపంలో పేకాటపై ఎస్ఐ సిబ్బందితో దాడిచేసి 8మందిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి రూ.4,570 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. వీరిని శుక్రవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

భవన నిర్మాణానికి విరాళం

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పల్నాడు విజ్ఞాన కేంద్ర నిర్మాణానికి సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య సతీమణి గద్దె ఉమశ్రీ గురువారం రూ.12లక్షలు విరాళాన్ని అందించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర నాయకులు బీ కృష్ణయ్య, గుంటూరు విజయకుమార్ ద్వారా విరాళాన్ని ఆమె అందించారు. గతంలోనే ఉమశ్రీ రూ.8లక్షలు అందించగా మొత్తం విరాళం రూ.20లక్షలకు చేరింది. విజ్ఞాన కేంద్రం ట్రస్ట్ కమిటీ తరపున ఆమెకు కృష్ణయ్య, విజయకుమార్‌లు అభినందనలు తెలిపారు.

ప్రతి పంచాయతీలోను శానిటేషన్ చేయాలి

నకరికల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సూపర్ శానిటేషన్, సూపర్ క్లోరినేషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీలో శానిటేషన్‌ను, క్లోరినేషన్‌ను అమలుపరచాలని నకరికల్లు పీఎస్, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాదు ఆదేశాలు జారీ చేశారు. గురువారం నకరికల్లులో శానిటేషన్, క్లోరినేషన్ చేయించారు.

నకిలీ పురుగుమందు గుర్తింపు

నకరికల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెగుళ్ళకు వాడే ప్రముఖ కంపెనీ పేరుతో ఉన్న నకిలీ పురుగుమందును ఆలస్యంగా గుర్తించారు. నరసింగపాడు గ్రామానికి చెందిన ఒక రైతు వరి పొలంలో తెగులుకు ప్రముఖ కంపెనీ పేరుతో ఉన్న ఆ ద్రావణాన్ని వాడారు. ఆ కంపెనీకి చెందిన ప్రతినిధి క్షేత్ర పరిశీలన చేయగా ఆ మందు తమ కంపెనీకి చెందినది కాదని, సదరు రైతు వద్ద వివరాలు సేకరించారు. ఆ రైతు తాను కొనుగోలు చేసిన నరసింగపాడులోని ఎరువుల దుకాణం పేరు చెప్పాడు. దీనిపై విచారణ జరపాల్సిన వ్యవసాయ అధికారులు మౌనంగా ఉండిపోవటం పలు అనుమానాలకు తావిస్తుంది. నకిలీ మందు తయారీదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

కారంపూడి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌కి మండలంలో నేలకొరిగిన విద్యుత్‌స్తంభాల స్థానంలో కొత్తవాటిని గురువారం ఆ శాఖ సిబ్బంది ఏర్పాటుచేశారు. 11కేవీ విద్యుత్ వైర్లను కూడా అప్పటికప్పుడు ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పడిపోయిన చింతచెట్లను తొలగించారు.

మాలధారులకు సద్ది

మండలంలోని లక్ష్మీపురం శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం మాలధారులకు సద్ది ఏర్పాటుచేశారు. లక్ష్మీపురానికి చెందిన కల్లం కోటిరెడ్డి కుటుంబసభ్యులు ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మాల ధరించిన భక్తులు సద్ది చేశారు. కారంపూడిలోని చెన్నకేశవస్వామి ఆలయంలో ఆలయ ప్రధానఅర్చకుడు కొమ్మనూరు సత్యనారాయణచార్యులు ఆధ్వర్యాన మాలధారులకు సద్ది నిర్వహించారు.

నిత్యావసరాల పంపిణీ

దుర్గి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఇబ్బందిపడ్డ దుర్గిలోని జంగాలకాలనీ, ఎస్సీ కాలనీవాసులకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు గురువారం కూటమి నేతలు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాగంటి నరేష్, సొసైటీ చైర్మన్ రామారావు, వెలిదండి శ్రీనివాసరావు, యల్లయ్య, జక్కా కొండలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

రెంటచింతల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో వివిధ మాలధారులు 800మందికి గురువారం అన్నదానం చేశారు. కావూరి బ్రహ్మయ్య, రమాదేవి, కోరే నాగేశ్వరరావు, కోటేశ్వరమ్మ, బత్తిన నూకరాజు, వెంకటలక్ష్మీ దంపతులు అన్నదానం చేశారు.

తుఫాన్ బాధితురాలికి బియ్యం, నగదు అందజేత

అచ్చంపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరులో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న రేకులషెడ్డు యజమాని నందిగం వెంకాయమ్మకు గ్రామ సర్పంచ్ జువ్వా శంకర్ 40 కిలోల బియ్యం, రూ.2వేల నగదును అందజేశారు. ఎమ్మెల్యే ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆమెకు సాయం అందజేసినట్టు శంకర్ తెలిపారు. వీఆర్‌వో నాగేశ్వరరావు, శిఖా పెద నాగయ్య, అశోక్, బుచ్చిబాబు, చిన రాజా, చిలుకా వీరయ్య పాల్గొన్నారు.

సూపర్ శానిటేషన్..

అచ్చంపేటలోని వీరభద్రస్వామి కాలనీలో గురువారం పారిశుధ్య కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో కోయా శ్రీనివాసరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సూపర్‌శానిటేషన్ నిర్వహించినట్టు డిప్యూటీ ఎంపీడీవో ఎం.మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌జాన్‌సైదా, పీఎస్ పంతులునాయక్ పాల్గొన్నారు.

పులిచింతల ప్రాజెక్టు వద్ద ఆందోళన

మండలంలోని పులిచింతల ప్రాజెక్టు వద్ద గురువారం గట్టుమోడు తండాకు చెందిన పలువురు రైతులు రెండు గంటలకు పైగా ఆందోళన చేశారు. రైతులకు తెలియకుండా పులిచింతల ప్రాజెక్టు నుంచి ఎక్కువ మొత్తంలో నీరు వదులుతున్నారని, ఈ నేపథ్యంలో పైర్లు మునిగి పోతున్నాయన్నారు. కృష్ణానది నుంచి కొండ కోయవాగు ద్వారా పొలాల్లోకి వరదనీరు ప్రవేశిస్తుందని, తక్కువ మొత్తంలో నీటిని వదలాలని విన్నవించారు.

పులిచింతల సమాచారం

పులిచింతల ప్రాజెక్టులో గురువారం 40.67 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 83,120 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, నాలుగు గేట్ల ద్వారా 81,285, మొత్తం 98,285 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

వరద బాధిత రైతులకు ప్రభుత్వ సాయం

● ఎంఎల్ఏ భాష్యం ప్రవీణ్


ముంపునకు గురైన పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ ప్రభావంతో వరద ముంపునకు గురై పంటలు నష్టపోయిన బాధిత రైతులకు ప్రభుత్వం సాయం చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గురువారం ఉదయం మండలంలోని ఉంగుటూరు, పెదమద్దూరు, చావపాడు, ఎండ్రాయి, వైకుంఠపురంతోపాటు పలు గ్రామాలలో దెబ్బతిన్న పంటలను ఎంఎల్ఏ పరిశీలించారు. రైతులతో మాట్లాడుతూ వ్యవసాయశాఖ అధికారు లు పంటనష్టం అంచనా వేస్తున్నారని అది పూర్తికాగానే ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చేందుకు కృషి చేస్తుందన్నారు. పెదమద్దూరులో పునరావాస కేంద్రాలలో ఉన్న 30 బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను ఎంఎల్ఏ ద్వారా రెవెన్యూ అధికారులు అందజేశారు. కా ర్యక్రమంలో తహసీల్దార్ డానియేలు, ఎంపీడీవో పార్వతీ, నరుకుళ్లపాడు, మునగోడు, వైకుంఠపురం పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్‌లు భాష్యం జగదీష్, నాగో తు నాగార్జున, బి.సూర్యనారాయణ, కూటమి నా యకులు రాజా, వసంతరావు, శౌరయ్య, బలరాం, సోమశేఖర్, శ్రీనివాస్, సాంబశివరావు, అనిల్ పాల్గొన్నారు.

శవాలతో రాజకీయాలు చేస్తున్న జగన్

● ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కులమతాల మధ్య సిచ్చు రేపి వైసీపీ ముఠా పబ్బం గడుపుకుంటుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చాడన్నారు. జగన్ హయాంలో రాష్ట్రంలో రాక్షసపాలన సాగిందన్నారు. వైఎస్ జగన్ శవాలతో రాజకీయం చేస్తున్నాడని కన్నా విమర్శించారు. కులాల మధ్య చిచ్చుపెట్టి లబ్దిపొందేందుకు జగన్ ప్రయత్నిస్తున్నాడన్నారు. పత్తిపాడులో మహిళ ఆత్మహత్య చేసుకుంటే వైసీపీ నాయకులు శవ రాజకీయం చేశారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలకు బూతులు తిట్టే స్క్రిప్ట్ జగన్ వద్ద నుంచి వస్తుందన్నారు.విమర్శకు ప్రతి విమర్శ చేసే సంస్కృతి లేదన్నారు. రాష్ట్ర ప్రజలు శాంతి సామరస్యాలతో జీవించాలని, అభివృద్ధి పథంలో


ముప్పాళ్ల: గోళ్ళపాడు ఎస్సీకాలనీ వాసులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నా

పయనించాలని కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. చిన్న ఘటనను పెద్దదిగా చూపించటం వైసీపీకి అలవాటుగా మారిందన్నారు. కాపు, కమ్మ మధ్య చిచ్చుపెట్టే ఆలోచన జగన్‌కు ఉందన్నారు. కులాల మధ్య గొడవలు పెట్టే సంస్కృతిని జగన్ మానుకోవాలని హితవు పలికారు. తుఫాన్ సమయంలో ప్రభుత్వం అనేక జాగ్రత్తలు తీసుకుందన్నారు.

బాధితులకు అండగా ఉంటా..

ముప్పాళ్ళ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాను బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకుంటుందని ఎమ్మెల్యే కన్నా అన్నారు. మండలంలోని గోళ్ళపాడులో తుఫాను బాధితులకు నిత్యావసరాలను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను వలన ఎవరైనా నష్టపోతే నేరుగా తనను సంప్రదించవచ్చన్నారు. 25 తుఫాను బాధిత కుంటుంబాలకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, కందిపప్పు, వంటనూనె, ఉల్లిగడ్డలు, దుంపలు, పంచదార అందజేశారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.60వేలను బాధితులకు అందించారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు దరువూరి నాగేశ్వరరావు, శిరిగిరి గోపాలరావు, బత్తుల నాగేశ్వరరావు, తహసీల్దార్ నగేష్, ఎంపీటీసీ కళ్ళం వీరభాస్కరరెడ్డి, ఆళ్ళ అమరేశ్వరరావు, పలువురు కూటమినాయకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్


విజయపురిసౌత్: నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న ధారునాయక్


రాజుపాలెంలో నేలవాలిన వరిపంటను పరిశీలిస్తున్న ఏవో వెంకటనరయ్య


వెల్దుర్తి: పంట నష్టాన్ని పరిశీలిస్తున్న అధికారులు


కారంపూడి: వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

విజయపురిసౌత్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారునాయక్ అన్నారు. గురువారం మాచర్ల మండలం కొత్తపల్లిలో నీట మునిగిన పంటలను ఆయన పరిశీలించి మాట్లాడారు. సీఎం చంద్రబాబు ముందుచూపుతో నష్టతీవ్రతను తగ్గించారని కొనియాడారు. టీడీపీ మాచర్ల మండల అ ధ్యక్షుడు నేరేటి వీరాస్వామియాదవ్, మూఢావత్ శ్రీనునాయక్, కాలేలూర్థు, మూఢావత్ వెంకటేశ్వర్లు నాయక్, రాంసింగ్ నాయక్, బాలునాయక్, శ్రీను, నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

● రాజుపాలెం: తుఫాన్‌తో మండలంలోని రైతులు దెబ్బతిన్నారు. రాజుపాలెం, రెడ్డిగూడెం, కోటనెమలిపురి, నెమలిపురి, దేవరంపాడు, ఇనిమెట్ల, రామిరెడ్డిపేట గ్రామాలలోని పంటపొలాలు నీట మునిగాయి.పెనుగాలుల ధాటికి బొప్పాయి, మిర్చి, వరిపంటలు నేలవాలాయి. మండలంలో వరిపంట 300 హెక్టార్లు, పత్తి 300 హెక్టార్లు నష్టపోయినట్లు ఏవో వెంకటనరసయ్య ప్రాథమిక అంచనా వేశారు.

● దాచేపల్లి: తుఫాన్‌కు నష్టపోయిన పంటలను అంచనావేసేందుకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు గ్రామాల్లో పంటపొలాలను పరిశీలిస్తున్నారు. నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో దెబ్బతిన్న పైర్లను అధికారులు రైతులతో పరిశీలించారు. ఎస్అగ్రహారం, కొత్తూరు, కాట్రపాడు, రామాపురం, పొందుగుల గ్రామాల్లో పంటలను పరిశీలించి నష్టాన్ని నమోదుచేస్తున్నారు. నష్ట అంచనాను తయారుచేస్తున్నట్టు ఏవో వెంకటేష్ వివరించారు.

● నకరికల్లు: పొలంలో నీటిని అంతర్గత కాలువల ద్వారా బయటకు పంపాలని ఇన్‌చార్జ్ ఏవో పోట్ల నరసింహారావు రైతులకు సూచించారు. గురువారం ఆయన తహసీల్దార్ కే పుల్లారావుతో కలసి నకరికల్లు, నరసింగపాడు గ్రామాల్లో తుఫాన్‌కు పడిపోయిన వరిపైరును పరిశీలించారు. గింజపట్టేదశలో ఉండటంతో వరిరైతులు చేపట్టాల్సిన చర్యలను తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ముస్తక్, ప్రభాకర్ పాల్గొన్నారు.

● వెల్దుర్తి: తుఫాన్ ప్రభావంతో సుమారు 350 ఎకరాల్లో మిర్చిపంట నష్టం జరిగినట్లు మండల ఉద్యానశాఖాధికారి వై మోహన్, ఏవో బాలాజీ గంగాధర్‌లు చెప్పారు. మండలంలోని రామచంద్రాపురంతండా, హనుమాపురం తండాల్లో వజ్రాలపాడు వాగు అలుగు పారి ముంచెత్తిన మిర్చి పంటలను గురువారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట నష్టం జాబితాను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

● కారంపూడి: తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో నష్టపోయిన వరి పొలాలను ఏవో పోట్ల నరసింహారావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్‌లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల సిబ్బంది నష్టపోయిన పంట పొలాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. పైరులో యాజమాన్య పద్ధతులను సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● బెల్లంకొండ: మండలంలో పలు గ్రామాల్లో తుఫాన్ వల్ల నష్టపోయిన పంటపొలాలను ఏవో అరుణకుమారి పరిశీలించారు. వరి, కంది, పత్తి, మిరపపంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయటానికి ఆర్ఎస్‌కే సిబ్బందికి సూచనలు చేశారు.

ముంపు పైర్లను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందం

అమరావతి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలతో పాటు వరద ముంపు వల్ల దెబ్బతిన్న పత్తి, మిరపపంటలను లాంఫాం శాస్త్రవేత్తల బృందం గురువారం మండలంలోని నరుకుళ్లపాడు, పెదమద్దూరు గ్రామాలలో పరిశీలించింది. బృందంలో ప్రిన్సిపల్ సైంటిస్టులు డాక్టర్ వీ మనోజ్‌కుమార్, డాక్టర్ సీహెచ్ నాగజ్యోతి, డాక్టర్ ఎల్ రాజేషచౌదరి, ఉద్యానశాఖ అధికారి ఎన్ సురేష్‌లు పత్తి, మిరప పంటల సంరక్షణకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో నరుకుళ్లపాడు, మునగోడు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు భాష్యం జగదీష్, నాగోతు నాగార్జున, ఏఓ అహ్మద్ పాల్గొన్నారు.


బెల్లంకొండ: కూరగాయల పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


అమరావతి: దెబ్బతిన్న పత్తిమొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

పొలాల్లో నీటిని వెంటనే బయటకు పంపాలి

బెల్లంకొండ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పొలాల్లో నిలిచిన నీటిని వెంటనే బయటకు పంపాలని రీజనల్ హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ డాక్టర్ వైఎస్ఆర్ హెచ్, డాక్టర్ జీ క్రాంతిరేఖ, డాక్టర్ రాధిక రమ్యలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని బెల్లంకొండ, మాచాయపాలెం గ్రామంలో మిరప, బొప్పాయి, కూరగాయల పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో బ్రీడింగ్ శాస్త్రవేత్త, మండల ఉద్యాన అధికారి అంజలి, టీడీపీ నేత గుడిసె కొండయ్య పాల్గొన్నారు.

లోలెవల్ చప్టాపై వర్షపు నీరు

● నిలిచిన రాకపోకలు

పెదకూరపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు ప్రాంతంలో కురిసిన వర్షాలకు మండలంలోని పరస గ్రామం నుంచి కంభంపాడు వెళ్ళే ఆర్అండ్‌బీ రోడ్డులో లోలెవల్ చప్టాలపై గురువారం కూడా వర్షపునీరు ప్రవహిస్తుండటంతో ఇరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 75 తాళ్ళూరు నుంచి గుంటూరు వెళ్ళే ఆర్టీసీ బస్సులు నిలిపివేయటంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. కంభంపాడు నుంచి పెదకూరపాడు ప్రభుత్వ కార్యాలయాలకు, మండలంలోని గ్రామాలకు రావాలన్నా అమరావతి మండలంలోని 14వ మైలు మీదుగా అమరావతి వెళ్ళి పెదకూరపాడు రావాల్సివస్తోంది. 9 కిలోమీటర్ల పరిధిలో మండల కేంద్రం ఉన్నప్పటికీ 30 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి పెదకూరపాడుకు చేరుకోవాల్సి వచ్చింది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్‌ని కంభంపాడు గ్రామస్తులు కోరుతున్నారు.

కూలిన ఇంటిని పరిశీలించిన హౌసింగ్ అధికారులు

విజయపురిసౌత్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌కు విజయపురిసౌత్‌లో గండిపోయిన గౌరమ్మ గృహం కూలిపోయింది. సదరు గృహాన్ని పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులను ఆదేశించడంతో మాచర్ల హౌసింగ్ ఏఈ సాతులూరి మరియదాసు గురువారం ఆ గృహాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అలీ పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి ఆధ్వర్యాన టీడీపీ, జనసేన నేతలు గురువారం గౌరమ్మ గృహాన్ని పరిశీలించి నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు బొల్లా వెంకటేశ్వర్లుచౌదరి, సాంబశివరావు, మైలపల్లి అప్పారావు, రాహుల్, అప్పలరాజు, మార్కు, చరణ్, బన్ను, షాహిర్, రాంసింగ్ పాల్గొన్నారు.

బాధితులకు రూ.1.20లక్షల ఆర్థికసాయం


వెల్దుర్తి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):మండలంలోని శిరిగిరిపాడు పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న కుంకుడుచెట్టు తండాకు చెందిన 40 కుటుంబాలకు రూ.1.20లక్షల నగదును గురువారం అధికారులు, కూటమి నేతలు అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.3వేల చొప్పున నగదు, నిత్యావసరాలు అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఎంపీడీవో ప్రసాద్, ఈ వోపీఆర్డీ మకట్‌లాల్, వీఆర్వో ఎస్ కొండలు, ఎం పీపీ సంజీవరెడ్డి, టీడీపీ నేతలు శివారెడ్డి, రామాంజిరెడ్డి, కొండలు పాల్గొన్నారు.

లాజర్‌కు ఘన సన్మానం

సత్తెనపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్మికవ్యవస్థ రద్దు చట్టం జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ పర్యవేక్షణ కమిటీ ఏర్పాటుచేసిన నాన్ అఫీషియల్ మెంబరు ఎస్సీ, ఎస్టీ బాండెడ్ కార్మిక వ్యవస్థ జిల్లా సభ్యుడిగా నియమితులైన ముప్పాళ్ళ మండలం మాదలకు చెందిన చింతపల్లి లాజర్ గురువారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. లాజర్‌ను కన్నా శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బలిజేపల్లి సురేష్ కుమార్, కల్లం వీర భాస్కరరెడ్డి, తెల్లజర్ల వెంకటేశ్వర్లు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతుకు ఆరోగ్యం

● జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి


రాజుపాలెంలో రైతు లక్ష్మీనారాయణ సాగుచేస్తున్న బీరపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు క్రాంతిరేఖ, రాధిక, రమ్య, జిల్లా అధికారి అమలకుమారి

రాజుపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతుకు ఆరోగ్యం, ఆనందం, ఆదాయం ఇస్తుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి అన్నారు. గురువారం రాజుపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న రైతులు నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణల పొలాలను అమలకుమారి, హార్టికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ జి.క్రాంతిరేఖ, డాక్టర్ రాధిక, రమ్యలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది సేంద్రియ పదార్థం పెరగడం వల్ల మొక్కలకు అవసరమైన పోషకాలు నేల నుంచే అందుతాయని చెప్పారు. ఘనజీవామృతం, జీవామృతం, కషాయాలు, బ్రహ్మాస్త్రం, దశపర్ణి కషాయం వంటి సేంద్రియ ద్రా వణాలను ఉపయోగించడం ద్వారా ఖర్చు తగ్గి ది గుబడి పెరుగుతుందన్నారు. తొలుత శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో ప లు పంటల సాగు రైతులకు లాభదాయకమేకాక ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునే శక్తినీ పెంచుతుందన్నారు. అనంతరం రైతు లక్ష్మీనారాయణ పొలంలో సాగు చేస్తున్న పలు పంటలను పరిశీలించారు.

విపత్తులను ఎదుర్కొనే సత్తా చంద్రబాబు సొంతం

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

రెంటచింతల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విపత్తులను ఎదుర్కొనే ధైర్యం సీఎం చంద్రబాబు సొంతమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లు శ్రమించి ప్రాణనష్టం లేకుండా చేశారని కొనియాడారు. గురువారం రెంటచింతల తహసీల్దార్, వ్యవసాయశాఖ ఏవో, విద్యు, ఆర్అండ్‌బీ ఏఈలతో ఎమ్మెల్యే ఫోన్లో మాట్లాడి వరద నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నష్టం వివరాల నివేదిక రూపొందించాలని ఎమ్మెల్యే తహసీల్దార్ మేరి కనకం, ఏవో లక్ష్మారెడ్డి, ఏఈ మస్తాన్ వలి, ఆర్ అండ్ బీ ఏఈ యూసఫ్ తదితర అధికారులను ఆదేశించారు.

వరదకు కొట్టుకుపోయిన వలలు, పుట్టీలు

విజయపురిసౌత్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బీభత్సం సృష్టించడంతో నాగార్జునసాగర్ డ్యాం దిగువ కృష్ణానదిలో మత్స్యకారుల వలలు, పుట్టీలు నదిలో బుధవారం రాత్రి కొట్టుకుపోయాయి. ఇక్కడ సుమారు 30 కుటుంబాల మత్స్యకారులు చేపల వేటతో జీవనం సాగిస్తున్నారు. తుఫాన్‌కు భారీ వర్షాలు పడడంతో సాగర్ డ్యాంకు ఎగువ నుంచి అకస్మాత్తుగా ఇన్‌ఫ్లో పెరిగింది. దీంతో డ్యాం అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా గేట్లు ఎత్తారు. దీంతో మత్స్యకారులు ఒడ్డున ఉంచిన 5 పుట్టీలు, 30 వలలు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. కొద్ది మొత్తంలో వలలు నది ఒడ్డున లభ్యమైనప్పటికీ నిరుపయోగంగా మారాయి. గురువారం మత్స్యకారుల సంఘం మాజీ అధ్యక్షుడు ఎరుపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సుమారు రూ.10లక్షల నష్టం వాటిల్లిందని బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.


నకరికల్లులో ఎస్‌హెచ్‌పీ కాలనీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమి

ప్రభుత్వ భూమి ఆక్రమణ

నకరికల్లు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నకరికల్లు ఎస్ఎస్‌పీ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమణకు గురైంది. గత వైసీపీ ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా నిరు పేదలకు ఇళ్ల పథకం కింద పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేసింది. నకరికల్లు ఎస్ఎస్‌పీ కాలనీలో ఇందుకోసం ఏర్పాటుచేసిన లే అవుట్‌లో పట్టాలను పంపిణీ చేయగా కొంత స్థలం మిగిలిపోయింది. ఇదే అదనుగా భావించిన గ్రామ సర్వేయర్లు వీఆర్‌వోను కలసి ఖాళీ భూమికి రూ.లక్ష చొప్పున పట్టాలను జారీ చేయకుండానే హద్దులు చూపించి వసూలు చేశారు. ఖాళీగా ఉన్న మరింత భూమిని ఆక్రమించి ప్లాట్లుగా విక్రయించి అమ్మే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విషయం గురువారం తహసీల్దార్ పుల్లారావు దృష్టికి రాగా ఈ లేఅవుట్‌ల పై పూర్తి విచారణ జరిపి నివేదిక అందించాలని ఆర్ఐ తోట సిద్ధయ్య, వీఆర్‌వోలు పాశం శారద, బీ అబ్బిరెడ్డి, నకరికల్లు విలేజ్ సర్వేయర్లకు ఆదేశాలు జారీ చేశారు.

పూర్తిగా దెబ్బతిన్న పంట

● క్రోసూరు సబ్ డివిజన్‌లో 18వేల హెక్టార్లలో అపార నష్టం


భారీ వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

క్రోసూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు క్రోసూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో పత్తి పంటకు అపార నష్టం సంభవించింది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాధారణ స్థాయి కంటే ఎక్కువగా 18,140 హెక్టార్లలో రైతులు పత్తి పంట వేశారు. ఎకరాకు సుమారు రూ.60వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ప్రస్తుతం ఎకరాకు 3నుంచి 4 క్వింటాళ్ళు మాత్రమే దిగుబడి లభించింది. భారీ వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఇక దిగుబడి లభించే అవకాశం లేదని రైతులు చెపుతున్నారు. వర్షాలకు తీతకు వచ్చిన పత్తి, పూత, పిందె రాలిపోయాయని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయినట్టు పీసపాడు, ఎర్రబాలెం, క్రోసూరు ప్రాంత రైతులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

పంటలకు తెగుళ్ళు వ్యాపించే అవకాశం


● క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ


నీట మునిగిన పత్తి పంటను పరిశీలిస్తున్న క్రోసూరు ఏడీఏ మస్తానమ్మ, అధికారులు

క్రోసూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భారీవర్షాల వల్ల పత్తి, మాగాణి పంటల్లో తెగుళ్ళు అధికంగా వ్యాపించే అవకాశం ఉందని క్రోసూరు ఏడీఏ పీ మస్తానమ్మ అన్నారు. భారీవర్షాలకు నీటమునిగిన పీసపాడు, ఎర్రబాలెం, కోసూరు గ్రామ పరిధిలోని పత్తి, మాగాణి పంటలను గురువారం ఆమె పరిశీలించారు. పత్తిలో కాయ కుళ్ళు, ఆకుమచ్చ తెగుళ్ళు వ్యాపించే అవకాశం ఉందన్నారు. వరిలో వర్షాలు కురిసినప్పుడు తాలు గింజలు ఏర్పడతాయని, బ్యాక్టీరియా, ఎండాకు, మాగుడు తెగులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. రైతులు సకాలంలో యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు చేపడితే పంటలను కొంతవరకు కాపాడు కోవచ్చన్నారు. ఏవో వీ వేణుగోపాల్, ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

రైతును నిండా ముంచిన తుఫాన్

● వరద నీటిలో కొట్టుకుపోయిన పంటలు


మండాదిలో కొట్టుకుపోయిన పైర్లు

వెల్దుర్తి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పంట చేతికొచ్చే సమయంలో రెండు రోజులపాటు కురిసిన వర్షాలు రైతులకు కన్నీరు మిగిల్చింది. మండలంలోని మండాదివాగు ఉధృతికి సమీప పంటపొలాలు తుడిచిపెట్టుకుపోయాయి. వజ్రాలపాడు చెరువు ఉధృతికి హనుమాపురంతండా, రామచంద్రాపురంతండా, వజ్రాలపాడు గ్రామాల్లోని మిర్చి, పత్తి, బొప్పాయి పంటలు నేలకొరిగాయి. పట్లవీడువాగు చెరువు అలుగు ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని పంటపొలాలు నీట మునిగాయి. ఆయా వాగుల ఉధృతికి మండలంలోని వందల ఎకరాల్లో పత్తి, మిర్చిపంటలు నీటిపాలయ్యాయి. మిర్చిపైరులో వేర్లతో సహా మొక్కలు పెకలించుకుపోయాయి. మరికొన్నిచోట్ల మొక్కలునేలవాలాయి.

చంద్రబాబు దూరదృష్టితో తగ్గిన పంట నష్టం

మాచర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దూరదృష్టితో మొంథా తుఫాన్ నష్టతీవ్రతను నివారించగలిగారని టీడీపీ సీనియర్ నేత యాగంటి మల్లికార్జునరావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, మంత్రి లోకేశ్‌లు గత ఐదు రోజులుగా తుఫాన్ పరిస్థితులను సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారన్నారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రాణనష్టం జరగలేదన్నారు. బొట్టు కోటేశ్వరరావు, తిక్కా కొండలు, పిన్నంశెట్టి కృష్ణ, రఫీ, స్వామి, కొత్తపల్లి ప్రవీణ్, బ్రహ్మం, భవానిబాయి, దుర్వాకుల ప్రసాదరావు, షేక్ మస్తాన్‌రావు, బొడ్డు ఈశ్వరయ్య, బీజేపీ నేతలు శివ, చిన్న అంజి తదితరులు ఉన్నారు.

నీటి మునిగిన పంటలను సంరక్షించుకోవాలి

సస్యరక్షణతో దిగుబడులు చేతికి.. నష్ట నివారణ

ఏడీఏ నాగభైరు మోహన్‌రావు

పంటలకు ప్రాణం పోద్దాం



మేడికొండూరు మండలంలో పత్తి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ నాగభైరు మోహన్ రావు

గుంటూరు సిటీ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలోని రైతులు మొంథా తుపాను తర్వాత చేపట్టాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. ఈ నేపథ్యంలోనే పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలను తుపాను ప్రభావిత మండలాలకు తీసుకువెళ్లి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అందులో భాగంగా గుంటూరు ఏడీఏ నాగభైరు మోహన్‌రావు శాస్త్రవేత్తలతో కలిసి పలు మండలాల్లో పర్యటించారు. పంటలు ముంపునకు గురైన రైతులు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన కీలక సూచనలు చేశారు. ఈ సూచనలు పాటిస్తే పంటలకు తిరిగి ప్రాణం పోయవచ్చని ఏడీఏ తెలిపారు.

పంట ముంపు అనంతర సూచనలు

పత్తి

90 రోజుల పంటలో (పూత, కాయ ఏర్పడి, వృద్ధి చెందే దశ)చాళ్ల ఏర్పాటు చేసి మొక్కలో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. యూరియా లేదా పొటాషియం నైట్రేట్ లేదా 19:19:19 ని ఒక శాతం మెగ్నీషియం సల్ఫేట్‌తో పాటుగా రెండు సార్లు 7 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. 5 గ్రాములు/లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రాములు స్ట్రెప్టోసైక్లిన్/లీటరు మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిసేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ముందస్తు చర్యగా 3 గ్రాములు లీటరు నీటికి మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రెసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4. 5% నాప్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

120 రోజుల పంట (కాయ పెరిగి పగిలే దశ)

పంటలో చాళ్ల ఏర్పాటు చేసి మొక్కల్లో గాలి, కాంతి ప్రసరణను పెంచాలి. వర్షాలు తగ్గిన పొడి వాతావరణంలో పత్తి తీతను చేయాలి. తేమ ఎక్కువగా ఉంటే, నీడలో ఆరబెట్టాలి.

5 గ్రా./లీ బోరాక్స్ 10-15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి.

కాయ కుళ్లని తగ్గించడానికి 3 గ్రా. కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) + 0.1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ / లీ. మొక్కల కింది భాగపు కొమ్మలు, పచ్చటి కాయలు తడిచేలా పిచికారీ చేయాలి. ఆకు మచ్చ తెగులు వృద్ధి చెందకుండా ఉండడానికి ముందస్తు చర్యగా 3 గ్రా./లీ. మాంకోజెబ్ లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ (సీఓసీ) పిచికారీ చేయాలి. (లేదా) ప్రొపికోనజోల్ గాని లేక క్రెసోక్సిమ్ మిథైల్ గాని 1 మీ.లీ./ లీ. మోతాదులో పిచికారీ చేయాలి.

గూడ, కాయ రాలడం ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ (4.5% నాప్తలీన్ అసిటిక్ ఆసిడ్) 0.25 మి.లీ./లీ. మోతాదులో పిచికారీ చేయాలి. 20 నుంచి 22 కణుపుల ఎత్తులో ప్రధాన కాండపు తల తుంచడం పాటించాలి.

వేరుశనగ

పంట పక్వ దశలో ఉంటే వర్షాలు తగ్గే వరకు పైరు పెరకడం, తీయడం చేయ కూడదు. పెరికిన పైరును కుప్పలుగా వేస్తే.. కాయలు మొలకలు వస్తాయి. పైరు వాదెలుగా ఉంచి పొలాల్లో నీరు చేరని ప్రదేశంలో ఆరబెట్టి ఉంచాలి. పొలంలో మురుగు నీరు తొలగించాలి. అక్టోబరు మొదటి వారంలో విత్తిన పైరుకు మొదలు కుళ్లు, ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంటుంది. నివారణకు వర్షం తగ్గిన వెంటనే మాంకోజెబ్ 2.5 గ్రాములు + కార్బండజిమ్ 12 శాతం లేదా హెక్సాకోనజోల్ 2.0 మీ.లీటర్లు లీటరు నీటిలో కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారి చేయాలి. విత్తుకు ముందు కిలో విత్తనానికి కార్బాక్సిన్(37.5శాతం) + థైరామ్ (37.5శాతం) 3గ్రాములు లేదా మాంకొజబ్ + కార్బండజిమ్ 25 శాతం 2 గ్రాములు లేదా పెంఫ్లుఫెన్ 13.28 + ట్రిఫ్లోక్సిస్ట్రోబిన్ 13.28 (2 మీ.లీ+ 4 మీ.లీ నీరు) కలిపి విత్తన శుద్ధి చేయాలి. లేత పైరుకు పొగాకు లద్దె పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 5% 0.4 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

మినుము, పెసర

మినుము, పెసర పంటలు మొలక దశ నుంచి శాఖీయ, పూత నుంచి కాయ కోత దశలలో ఉన్నాయి. మొలక దశ నుంచి శాఖీయ దశలో ఉన్న పంట ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. ఇనుపధాతు లోపం కనిపించే అవకాశం ఉంది కావున.. నివారణకు అన్నబేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు+ యూరియా 100 నుంచి 150 గ్రాములు 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి. దీంతో పంట సమర్థంగా కోలుకోవడానికి దోహదపడుతుంది. వారం తర్వాత ఒక శాతం 19:19:19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేయాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి.

పూత నుంచి కాయ దశ

ముంపునకు గురైన పొలాల్లో మురుగు నీరు వీలైనంత త్వరగా తొలగించాలి. వేరుకుళ్లు, ఆకు మచ్చ తెగుళ్ల రాకుండా హెక్సాకొనజోల్ లేదా ప్రొపికొనజోల్‌ను పిచికారి చేయాలి. మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిఫైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి ఏదో ఒక మందును ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మొక్కజొన్న

పొలాల్లో నిల్వ నీటిని 48 గంటల్లోగా తొలగించాలి. పొలం ఎండిన తర్వాత ఒక శాతం యూరియా, 0.5శాతం జింక్ సల్ఫేట్ కలిపి ఆకులపై పిచికారీ చేయాలి. కోతకు వచ్చిన మొక్కజొన్న పొత్తులను తక్షణం కోసి, వాటిని 13శాతం తేమ స్థాయికి ఆరబెట్టడం ద్వారా మొలకెత్తడం, నాణ్యత తగ్గుదలను నివారించవచ్చు. తేమ సాగుతున్న ప్రాంతాల్లో మొక్కజొన్న పంటపై ఫంగస్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రొపికొనజోల్ (0.1శాతం) వంటి తగిన ఫంగిసైడ్‌ను పిచికారి చేయాలి.

కంది..

ప్రస్తుతం కంది పంట మొలక దశ నుంచి పూతకు వస్తోంది. ఇనుపధాతు లోపం నివారణకు.. అన్న బేది 50 గ్రాములు + నిమ్మ ఉప్పు 5 గ్రాములు + యూరియా 100 నుంచి 150 గ్రాములను 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి.

పంట కోలుకోవడానికి 19: 19: 19 లేదా పొటాషియం నైట్రేట్‌ను పిచికారి చేసుకోవాలి. ఎండు తెగులు లక్షణాలు కనిపిస్తే.. కాపెర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి వేర్లు తడిచేట్లు మొదళ్లలో పోయాలి. పంట పూత దశలో ఉన్నట్లయితే మారుక మచ్చల పురుగు ఆశించే అవకాశం ఉంది. దీనికి క్లోరిఫైరిఫాస్ 20 ఇ.సి లేక నోవాల్యురాన్ 10 ఇ.సి లేదా స్పైనోసాడ ఏదో ఒక మందును పిచికారి చేయాలి.



తుఫాన్ ధాటికి విరిగిపడ్డ అరటి చెట్లు

వాణిజ్యం.. విలవిల

● కన్నీటి పర్యంతమవుతున్న అన్నదాతలు

కొల్లూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురు గాలులకు దెబ్బతిన్న వాణిజ్య పంటలు రోజుకో విధంగా రూపురేఖలు కోల్పోతున్నాయి. మండలంలోని చిలుమూరులంక, సుగ్గునలంక, ఈపూరులంక, చింతలంక, పెదలంక, పోతార్లంక, కిష్కిందపాలెం తదితర లంక గ్రామాల్లో రైతులు అరటి, బొప్పాయి, తమలపాకు, కంద, పసుపు తదిర వాణిజ్య పంటలతో పాటు మినుము, కూరగాయ పంటలను సాగు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం తుఫాన్ తీరం దాటే సమయంలో బలంగా వీచిన గాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు, పసుపు, కంద, కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పోతార్లంక సమీపంలో పలుచోట్ల అరటి తోటలు గాలి తీవ్రతకు కూకటివేళ్లతో సహా విరిగిపడ్డాయి. వర్షం, గాలుల తీవ్రతకు కంద, పసుపు, బొప్పాయి పంటలు కూడా దెబ్బతినగా వర్షపు నీటిలో ఉన్న పసుపు కుళ్లిపోతోంది. కంద పైరు చెట్లు విరిగిపోవడం దుంప ఉరే పరిస్థితి లేకుండా పోయింది. బొప్పాయి చెట్లు విరిగిపోవడంతో పాటు కాయలు పూర్తిగా రాలిపోయాయి. చింతల్లంక వద్ద సాగులో ఉన్న దొండ, కాకర పందిళ్లు కుప్పకూలిపోయాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి పండించిన పంటలు తుఫాన్ తాకిడికి గురై కళ్ల ముందు జీవం కోల్పోతుంటే అన్నదాతలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం అరకోర అందించే సాయానికి తాము నష్టపోయిన దానికి పొంతన లేకుండా ఉంటోందని.. పరిహారం పెంచి అందిస్తే కొంత వరకు కోలుకునే పరిస్థితి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



కుళ్లిపోతున్న పసుపు పైరు



గాలులకు పడిపోయిన కందపైరు



ఈదురుగాలులకు పడిపోయిన కాకర పందిళ్లు

కొండవీటి వాగు రివర్స్ ఫ్లో

రెగ్యులేటర్ దెబ్బతినడంతో ఎదురెళ్తున్న వరద

లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడుతున్న యంత్రాంగం

విజయవాడ సిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని వరద నీటిని కృష్ణా నదిలోకి చేరవేసే కొండవీడు వాగు రెగ్యులేటర్ ప్రమాదస్థాయికి చేరింది. నదిలో పెరిగిన వరద నీరు దెబ్బతిన్న రెగ్యులేటర్ గేట్ల ద్వారా తిరిగి వాగులోకి చేరుతోంది. రాజధాని ప్రాంతంలోని లాం గ్రామం నుంచి కొండవీడు వాగు ప్రారంభమై పెదపరిమి, నీరుకొండ, కృష్ణాయ పాలెం, పెనుమాక, తుళ్లూరు, వెలగపూడి మీదుగా కృష్ణానదిలోకి చేరుతుంది. 30 కిలోమీటర్ల పొడవు ఉండే ఈ వాగులోకి కొట్టెల్ల వాగు, పాలవాగు, ఎర్రవాగులు సైతం కలుస్తాయి. ఆయా ప్రాంతా లు ముంపుబారిన పడకుండా ఈ వాగులే రక్షణగా ఉంటాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాల్లోని సాగు భూముల్లోకి భారీగా నీరు చేరింది. ఆ నీటిని అంతా కొండవీడు వాగు మాత్రమే కృష్ణా నదిలోకి చేరవేయాల్సి ఉంటుంది. కృష్ణానదిలో నీరు తక్కువగా ఉంటే కృష్ణానది వద్ద కట్టిన రెగ్యులేటర్ నుంచి ఈ నీరు గ్రావిటీ ద్వారా నదిలో కలుస్తుంది. నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్న సందర్భాల్లో రెగ్యులేటర్ గేట్లను దించేసి, పక్కనే ఉన్న లిఫ్ట్ ద్వారా నదిలోకి తోడతారు.



కొండవీటి వాగు వద్ద వరద ఉధృతి

నదిలో నీళ్లు నదిలోకే..

దాదాపు 30 ఏళ్ల కిందట కట్టిన రెగ్యులేటర్ గేట్లు అన్నీ దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా అమరావతి నుంచి వస్తున్న వరదతో కొండవీడు వాగు నిండుకుండలా మారింది. మరోవైపు కృష్ణానది సైతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరదతో నిండిపోయింది. గురువారం నదిలో నీటిమట్టం ఊహించని రీతిలో 15 అడుగులకు చేరింది. రాత్రి 7 గంటల ప్రాంతంలో నది నుంచి 5.66 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. రెగ్యులేటర్ గేట్లు ఐదు పూర్తిగా, మిగిలినవి పాక్షికంగా దెబ్బతిన్నాయి. వీటి నుంచి ప్రతి గంటకూ సుమారు 700 క్యూసెక్కుల నీరు కొండవీడు వాగులోకి చేరుతోందని అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇదే నీటని లిఫ్ట్ మూడు పంపులు ద్వారా తిరిగి కృష్ణానదిలోకి తోడుతున్నారు. ప్రతి గంటకు 1,059 క్యూసెక్కుల నీటిని లిఫ్ట్ ద్వారా నదిలోకి చేరవేస్తున్నారు. దీనిలో అమరావతి గ్రామాల నుంచి వచ్చే నీరు సుమారు 350 క్యూసెక్కులు, కృష్ణానది నుంచి వాగులోకి వచ్చే నీరు గంటకు 700 తోడాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. మరోవైపు ఇదే ప్రాంతం నుంచి వాగు నీటిని బకింగ్‌హామ్ కాల్వలోకి రెండు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి వదులుతున్నారు.

10 వాట్సాప్ గ్రూపుల అడ్మిన్లకు నోటీసులు

● అసత్య కథనాల కట్టడికి పోలీసుశాఖ చర్యలు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసత్య ప్రచారాల కట్టడికి పోలీస్ శాఖ నడుం బిగించింది. వాట్సాప్ గ్రూపుల్లో పోలీసు అధికారులను, సిబ్బందిని సభ్యులుగా చేర్చుకుని కథనాలు పోస్టు చేస్తూ బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో.. పోలీస్ శాఖ చర్యలకు సిద్ధమైంది. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు సృష్టించి పోస్ట్ చేసినా, వాటిని ఫార్వర్డ్ చేసినా అందుకు గ్రూపు అడ్మిన్లదే బాధ్యత అని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా 15 వాట్సాప్ గ్రూపులను గుర్తించారు. ముందుగా 10 క్రైమ్ గ్రూపుల అడ్మిన్ లకు నోటీసులు ఇవ్వాలని పోలీస్ శాఖ నిర్ణయించింది. వారు నివాసం ఉండే పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల నుంచి వారికి పిలుపు వచ్చింది. స్టేషన్‌కు వచ్చి నోటీసులు తీసుకోవాలని సూచించారు. నగరంలోని లాలాపేట స్టేషన్ పరిధిలో ఉన్న నాలుగు గ్రూప్‌ల అడ్మిన్‌లకు నోటీసులు సిద్ధం చేసి.. వాటిని తీసుకోవాలని ఫోన్‌లు చేసి చెప్పారు. అలాగే అరండల్ పేట, నగరంపాలెం, పెదకాకానితో పాటు పొన్నూరు టౌన్‌కు చెందిన అడ్మిన్‌లు ఉన్నారు. అలాగే మరో రెండు ఇతర రాష్ట్రాలు, ఇతర జిల్లాల అడ్మిన్‌లు కూడా ఉన్నారు. వారికి కూడా నోటీసులు ఇవ్వనున్నారు. రెండో దఫా కూడా మరికొన్ని గ్రూపులకు నోటీసులు ఇచ్చేందుకు చర్యలు ప్రారంభించారు. అలాగే యూ ట్యూబ్ చానళ్ల పేరుతో.. పోలీసులను, వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తున్న ఘటనలపై పోలీస్ శాఖ దృష్టి సారించింది. కొందరు ఏకంగా జిల్లా పోలీస్ కార్యాలయానికే వచ్చి బాధితులను డబ్బు డిమాండ్ చేస్తున్న విషయం కూడా పోలీసు అధికారుల దృష్టికి వచ్చింది.

రైల్వేపై మొంథా ఎఫెక్ట్

● చీకటీగలపాలెం, గుండకమ్మ మధ్యన ఒరిగిన రైల్వే లైన్ గట్టు

● వెంటనే మరమ్మతులు చేసిన కార్మికులు

గుంటూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గుంటూరు - నంద్యాల రైలు మార్గంపై ప్రభావాన్ని చూపించింది. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా చీకటీగలపాలెం, గుండ్లకమ్మ మధ్యన కొంత భాగం రైలే ్వలైన్ గట్టు దెబ్బతింది. ఎత్తైన ప్రదేశంలో మట్టి జారిపోవడంతో ఒక దశలో రైలు పట్టాలు కూడా ఒరిగిపోతాయని భావించారు. దీనిని గుర్తించిన వెంటనే కీ మెన్‌లు, కార్మికులు అధికారులకు నివేదించారు. రైల్వే అధికారుల సూచనలతో ఇసుక బస్తాలు పేర్చి గట్టు మరింత ఒరిగిపోకుండా కాపాడారు. మరోవైపు గుంటూరు - గుంతకల్లు రైల్వే లైన్ రద్దీ మార్గాల్లో ఒకటి కావడంతో రైళ్ల, గూడ్స్ రేక్‌ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. దీంతో ఈ మార్గంలో రళ్ల రద్దు, దారి మళ్లించడం వంటివి అవసరం లేకుండా పోయింది.



చీకటీగలపాలెం - గుండ్లకమ్మ సెక్షన్‌లో ఒరిగిన రైలుమార్గం గట్టుని కాపాడిన కార్మికులు

తీరనున్న క్రీడా ఇక్కట్లు!

● ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్స్ ● గోదాముకు చేరుకున్న క్రీడా పరికరాలు ● పంపిణీకి విద్యాశాఖ ఏర్పాట్లు

గుంటూరు(విద్య): అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఒక్కో పాఠశాలకు రూ.10 వేల నుంచి రూ. 30 వేల విలువైన సామగ్రి అందజేయనున్నారు. ఇప్పటికే కొన్ని పాఠశాలలకు సంబంధించిన క్రీడా పరికరాలు క్లస్టర్ పాఠశాలలకు చేరాయి. గుంటూరు క్లస్టర్‌కు సంబంధించి నగర సమీపంలోని ఏటుకూరు జడ్పీ ఉన్నత పాఠశాల గదుల్లో నిల్వ చేశారు. త్వరలో మండలాల వారీగా స్కూల్స్‌కు పంపిణీ చేయడానికి విద్యాశాఖ ఏర్పాటు చేస్తోంది.

అన్ని ఉన్నా..క్రీడా సామగ్రి లేక..

ఉమ్మడి జిల్లాలో 2000 పైగా ప్రాథమిక, 600 పైగా ప్రాథమికోన్నత, 450 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు 6.50 లక్షల మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. అత్యధిక పాఠశాలల్లో విశాలమైన క్రీడా ప్రాంగణాలు అందుబాటులో ఉన్నాయి. జడ్పీ, యూపీ పాఠశాలల్లో నిష్ణాతులైన ఫిజికల్ డైరెక్టర్లు ఉన్నారు. క్రీడా పరికరాల లేమి కారణంగా విద్యార్థులకు సరైన శిక్షణ అందడం లేదు. కూటమి ప్రభుత్వం క్రీడలకు మెరుగైన అవకాశం కల్పించే దిశగా ఆలోచన చేసింది. ఇందులో భాగంగా ప్రతి పాఠశాలకు క్రీడా పరికరాలు పంపిణీ చేయాలని నిర్ణయించారు.



బాస్కెట్‌బాల్ శిక్షణలో...



క్రికెట్ సాధన చేస్తున్న విద్యార్థులు

క్రీడా పరికరాల పంపిణీ ఇలా..

ప్రతి పాఠశాలకు అవసరమైన క్రీడా పరికరాల ఇండెంట్లను విద్యాశాఖ సేకరించింది. ఇందులో 67 రకాల బ్రాండ్స్ అందుబాటులో ఉంటాయి. ప్రధానంగా అవుట్ డోర్ గేమ్స్ క్రికెట్, ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, టెన్నికాయిట్, ఖో-ఖో పోటీలకు అవసరమైన క్రీడా పరికరాలు, ఇండోర్ గేమ్స్ కు సంబంధించి క్యారమ్స్, చెస్ బోర్డులు అందజేస్తారు. ప్రాథమిక పాఠశాలకు రూ.10 వేలు, ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.17వేలు, ఉన్నత పాఠశాలకు రూ.25 వేల నుంచి రూ.30 వేల ఖరీదు చేసే క్రీడా పరికరాలు అందిస్తారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ ద్వారా జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాఠశాలల ఫిజికల్ డైరెక్టర్లకు దిశానిర్దేశం చేయనున్నారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని డీఈఓ సీవీ రేణుక తెలిపారు. క్రీడా పరికరాలు ఇప్పటికే కొన్ని వచ్చాయని, దశల వారీగా పంపిణీ చేస్తామన్నారు.

ఉప్పొంగిన పాతాళగంగ

బొల్లాపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలకు భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో మండలంలోని గాటి తండాలో రెండు వ్యవసాయ బోర్ల నుంచి పాతాళ గంగ ఉబికి వస్తోంది. తండాకు చెందిన భూక్యా బద్దునాయక్ మిరప చేనులోని ఈ బోర్లలో నిరంతరం పైకి వస్తున్న నీటిని చూసేందుకు.. స్థానికులు అక్కడికి వస్తున్నారు.



గాడితండా వద్ద వ్యవసాయ బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పోలీసులకు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

నరసరావుపేట లీగల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాల్లో భాగంగా గురువారం పోలీస్ సిబ్బందికి విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఈ పోటీలు నిర్వహించారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాల పాత్రపై, స్త్రీలు, పిల్లలను వేధింపుల బారినుంచి రక్షించడంలో విద్యార్థుల పాత్ర అనే అంశంపై పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఆర్డీ ఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, రాజా, ఎంటీ ఆర్ఐ కృష్ణ, ఏఎన్ఎస్ ఆర్ఐ యువరాజ్, సిబ్బంది పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

23 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

చిలకలూరిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 29 మందికి రూ.23.82 లక్షల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ప్రతివారం 30 నుంచి 40 మందికి సీఎం.ఆర్.ఎఫ్ ద్వారా సాయం అందిస్తున్నట్టు ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, పఠాన్ సమద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



దేవస్థాన సిబ్బందికి విరాళాన్ని అందజేస్తున్న గజ్జవల్లి సుబ్బారావు కుటుంబ సభ్యులు

సోమేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి విరాళం

బొల్లాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లటూరుకు చెందిన సోమేశ్వరస్వామి దేవస్థాన పునరుద్ధరణకు పెద్దిశెట్టి వంశ పారంపర్య ధర్మకర్త గజ్జవల్లి వెంకట సుబ్బారావు, వెంకట సత్యావతి జ్ఞాపకార్థం వారి కుమారులు గురువారం విరాళం అందజేశారు. గజ్జవల్లి వెంకట రామయోగి రామ ప్రసాదు, నాగమునేశ్వరరావు, నాగపవన్ కుమార్ దంపతులు రూ.6,06,069లను దేవస్థాన జూనియర్ అసిస్టెంట్‌కు దద్దాల కోటేశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు బేతపూడి వెంకటేశ్వర్లు, అడకా లింగరాజు, గంజి ఏడుకొండలు, కజ్జాయం లక్ష్మీనారాయణ, పెంటాల వెంకటేశ్వర్లు, రంగ నాయకులు, రాజేష్ కుమార్, దేవదాయ శాఖ ఈవో శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ...

నరసరావుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని కోటబజార్ పులుపులవారి వీధిలోని శ్రీవీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి గురువారం దాతలు విరాళం అందజేశారు. చిలకల గురవయ్య బాబు, వెంకటలక్ష్మి, చిలకల గురవయ్య, వెంకట పద్మావతి దంపతులు మండపంపై సాలహారం నిమిత్తం రూ.6,00,116లు విరాళం అందజేశారు. పిన్నంశెట్టి వెంకటసుధాకర్, ఝాన్సీలక్ష్మి దంపతులు రూ.51,116లు విరాళం అందజేశారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణం కోసం...

ఇసప్పాలెం (నరసరావుపేట రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటకు చెందిన బొలిశెట్టి రోహిణి జ్ఞాపకార్థం కుమారుడు బొలిశెట్టి చంద్రశేఖర రాంబాబు, స్వప్న ఆరుష్, అకీర ఆలయ పునః నిర్మాణం కోసం రూ.2లక్షలు ఆలయ కార్యనిర్వాహక అధికారి నలబోతు మాధవీదేవికి గురువారం అందజేశారు.

వైభవంగా శ్రవణ నక్షత్రం పూజలు

నరసరావుపేట అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మునిసిపల్ కార్యాలయ ప్రాంగణంలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం పూజలు గురువారం వైభవంగా జరిగాయి. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్‌శర్మ పూజలు నిర్వహించారు.

మోడల్, ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వసతులకు నిధులు

వినుకొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం మోడల్ పాఠశాలకు, నూజెండ్ల మండలం ఉప్పలపాడులోని ఏపీఎస్‌డబ్ల్యూ రెసిడెన్షియల్ పాఠశాలలకు రూ.1.32కోట్లు మంజూరు చేశారు. కంప్యూటర్ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్స్, సోలార్ ప్యానల్, అడిషనల్ క్లాస్‌రూమ్స్, ప్లేగ్రౌండ్ వంటి వసతుల కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరయ్యాయి.

ఎంఏఎం ఫార్మసీలో వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన

నరసరావుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఎంఏఎం ఫార్మసీ కాలేజీలో వరల్డ్ స్ట్రోక్ డేపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ నెల్లూరి రమేష్ మాట్లాడుతూ స్ట్రోక్ అనేది మెదడు భాగాలకు రక్త ప్రసరణ ఆగిపోవడం వల్ల సంభవించే తీవ్రమైన పరిస్థితి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, చైర్మన్ ఎంఆర్ శేషగిరిరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ ఎస్.రాజిని, శాలెంరాజు, అధ్యాపకులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఈసీలో ఉత్సాహంగా సంగీత వేడుకలు

నసరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఉత్సాహంగా సంగీత వేడుకలు నిర్వహించినట్లు కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ గాయనీ, గాయకులు శ్రీష్టిచిల్లా, పవన్‌కల్యాణ్, డి.ధీరజ్, బ్రిందా తదితరులు పాల్గొన్నారు.

పేరూరుపాడులో పారిశుధ్య పనులు

బొల్లాపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరుపాడు, బొల్లాపల్లి, రెడ్డిపాలెం తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ముందుగా కాలువల్లో బ్లీచింగ్ చల్లించి ఫాగింగ్ చేయించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో పీ మాధురి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ కెనాల్‌ను పరిశీలించిన ఎస్ఈ కృష్ణమోహన్

ఈపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి ప్రధాన కాలువను గురువారం ఎస్ఈ కృష్ణమోహన్ పరిశీలించారు. తుఫాన్ ప్రభావంతో పెరుమాళ్ళపల్లి మేజర్ హెడ్ వద్ద మెయిన్ కెనాల్ కట్ట గోడ కూలినట్లు గుర్తించారు. అక్కడ రింగ్ వాల్స్ లేకపోవడం పునాది లేకుండా గోడ నిర్మించడంతో కూలినట్లు గుర్తించారు. కట్ట బలహీనంగా ఉన్న చోట ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఈఈ శ్రీనివాసరావు, డీఈ శ్రీదేవి, వినుకొండ డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్‌రావు, సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు తదితరులు ఉన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

● ఎకరాకు రూ.10వేలు నష్ట పరిహారం ● చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు





కొచ్చెర్ల వద్ద నేలవారిన వరిపైరును, నూజెండ్ల మండలంలో దెబ్బతిన్న రోడ్లను పరిశీలిస్తున్న చీఫ్ విప్,జీవీ, మక్కెన

ఈపూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎకరాకు రూ.10వేలు నష్ట పరిహారం చెల్లించడం జరుగుతుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలో మొంథా తుఫాన్ దాటికి దెబ్బతిన్న వరి పైరును గురువారం జీవీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ దెబ్బకు రాష్ట్రంలో 1825 గ్రామాలలో 87 వేల హెక్టార్లలో పంటల నష్టం జరిగిందన్నారు. అధికారులందరూ సమన్వయంతో చక్కగా పనిచేశారు. రాష్ట్రంలో రోడ్లు, కల్వర్టులు దెబ్బతినడం వలన రూ.2వేల కోట్లు నష్టం వాటిల్లిందన్నారు. పల్నాడు జిల్లాలో సుమారు 50వేల ఎకరాల పంట నష్టం జరిగిందన్నారు. నష్టపరిహారం రైతుల ఖాతాలలోనే జమ చేయడం జరుగుతుందన్నారు. పంటలను పరిశీలించిన వారిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు నగేష్, శ్రీనివాసరావు, సత్యగోపాల్, వినుకొండ ఏడీఏ రవికుమార్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, జనసేన నియోజక వర్గ కన్వీనర్ కే.నాగశ్రీను రాయల్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

● వినుకొండ: తుఫాన్ తాకిడి కారణంగా నీరు ఉధృతంగా ప్రవహించడంతో మండలంలోని బ్రాహ్మణపల్లి పంచాయతీ పరిధిలోని అరుంధతి కాలనీ, రజక కాలనీ, డ్రైవర్ కాలనీలోని సుమారు 100కుటుంబాలకు చెందిన 300మందిని సమీపంలోని నిర్మల పాఠశాలలో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు గురువారం వరద ప్రాంతాల్లో పర్యటించి నివాస గృహాల్లోని బాధితులకు దుప్పట్లు పంపిణీ చేశారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని రాణాహుస్సేన్ పంజా సమీపంలోని ఆకులవారి వీధిలో తుఫాను తాకిడికి పాత మిద్దె కూలి మృతిచెందిన మర్రెడ్డి రాములమ్మ మృతదేహాన్ని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావులు సందర్శించి నివాళులర్పించారు.

● వినుకొండ టౌన్: మొంథా తుఫాన్ కారణంగా సంభవించిన వరదల్లో తీవ్రంగా నష్టపోయిన వినుకొండ మండలం నాగిరెడ్డిపల్లి పంచాయతీలోని అరుంధతీ కాలనీ, రజక కాలనీలలోని 200కు పైగా కుటుంబాలకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధితులకు సహాయ సామాగ్రిని పంపిణీ చేశారు. ప్రతి కుటుంబానికి రెండు దుప్పట్లు, రెండు చీరలు, బియ్యం, నిత్యావసరాలు అందించారు. కుటుంబానికి రూ.1,000 పంపిణీ చేశారు. కార్యక్రమంలో పరిశీలకులు మానుకొండ శివప్రసాద్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన వారిని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, రోడ్లు, కాలువలు, పడిపోయిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి ప్రజా జీవనానికి ఆటంకం లేకుండా చూస్తామని జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం మండలంలోని పువ్వాడ, ఉప్పలపాడు, తలార్లపల్లి, గొల్లపాలెం గ్రామాల్లో పర్యటించి తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న రోడ్లు, కాలువలు, కల్వర్టులను పరిశీలించి మరమ్మతులు చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

తుఫాన్ బాధితులకు సాయం

నరసరావుపేట రూరల్ నరసరావుపేట టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సహాయక చర్యలు మూడురోజులుగా నిర్విరామంగా కొనసాగుతున్నాయి. నరసరావుపేట మండలం కేశానుపల్లి పంచాయతీ పరిధిలోని టిడ్కో గృహాల వద్ద తుఫాన్ బాధితులకు గురువారం మధ్యాహ్నం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు భోజనం అందజేశారు. ఎస్ఆర్‌కేటీ కాలనీలో, చంద్రబాబునాయుడు కాలనీలో, లింగంగుంట్ల ఎస్టీ కాలనీలో ముంపు బాధితులకు ఎమ్మెల్యే భోజన సదుపాయం ఏర్పాటు చేసి, స్వయంగా వడ్డించారు.

● రొంపిచర్ల: మండలంలోని వీరవట్నంలో మాజీ సర్పంచ్ జాష్టి ప్రసాదు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రూ.20వేలు విలువ చేసే కూరగాయలను ఎస్సీ కాలనీలో పంపిణీ చేశారు.

పసుమర్రులో 205 మందికి నిత్యావసరాల పంపిణీ

చిలకలూరిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం పసుమర్రులో తుపాను ప్రభావిత ప్రాంతాలలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తహసీల్దార్ మహమ్మద్ హుస్సేన్‌తో కలిసి పర్యటించి బాధితులకు సాయం అందచేశారు. గ్రామ ఎస్టీ కాలనీలోని 205మంది నిర్వాసితులకు ఒక్కొకరికి 25కేజీల బియ్యం, నిత్యావసరాలు, రూ.వెయ్యి నగదు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కౌన్సిలర్ జాలాది సుబ్బారావు, కె.శ్రీనివాసరావు, చైతన్య, గద్దె చౌదరి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

● నాదెండ్ల: కనపర్రు గ్రామ పరిధిలో తుఫాన్ ప్రభావంతో డాబా పెచ్చులూడి ఆర్థికంగా నష్టపోయిన దార్ల రాయన్న కుటుంబానికి టీడీపీ నేతలు సాయం అందించారు. రూ.30వేల ఆర్థికసాయాన్ని నాయకులు వజ్జె సింగయ్య, నాతాని రాఘవయ్య, ఎం.రాజా, ఖాజా మొహిద్దీన్, అంతయ్య తదితరులు అందజేశారు.





నరసరావుపేట టిడ్కో గృహాల వద్ద తుఫాన్ బాధితులకు భోజనం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, పసుమర్రులో తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, తహసీల్దార్ తదితరులు

రైతులను నిండా ముంచిన మొంథా

● పెట్టుబడి సాయం అందించాలని రైతుల వినతి





జాలాది-గుత్తావారిపాలెం గ్రామాల మధ్యన నీట మునిగిన జూట్ పైరు, - కారుచోలలో వర్షానికి దెబ్బతిన్న పత్తి



ఏనుగుపాలెం రోడ్డు గాంధీనగర్ సమీపంలో మిర్చి పంటలో నిలిచిన వర్షపు నీరు

యడ్లపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను రైతులను నిండా ముంచివేసింది. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు వాగులు పొంగి పొర్లి పంట పొలాలను ముంచెత్తడంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రధాన వాణిజ్య పంట అయిన పత్తి చేతికి అందివచ్చే దశలో కురిసిన వర్షాలకు పంట పూర్తిగా పాడవడంతో ఎకరాకు సుమారు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టామని, తీరా పంట చేతికొచ్చే దశలో తుఫాను తమ ఆశలను అడియాశలు చేసిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వర్షాలకు సొలస, చెంఘీజ్‌ఖాన్‌పేట, కొండవీడు, లింగారావుపాలెం పరిధిలోని పత్తి, మిర్చి పైర్లు దెబ్బతినగా నక్కవాగు పొంగి పొర్లడంతో పరివాహక గ్రామాలైన సందెపూడి, తుర్లపాడు, జాలాది, జగ్గాపురం, తిమ్మాపురం, దింతెనపాడు, గుత్తావారిపాలె, యడ్లపాడు, మైదవోలు గ్రామాల పరిధిలోని పైర్లు ముంపునకు గురయ్యాయి. కొండవాగు, వంకాయలపాడు నుంచి వచ్చే వీరమ్మ వాగు ప్రభావంతో కారుచోల పరిధిలోని పైర్లు దెబ్బతిన్నాయి.

● నాదెండ్ల: మండలంలోని కుప్పగంజి వాగు ఉధృతి గురువారం కూడా కొనసాగింది. గణపవరంతో పాటు కనపర్రు, అమీన్‌సాహెబ్‌పాలెం, ఇర్లపాడు తదితర గ్రామాల పరిధిలోని పొలాలు వందలాది ఎకరాలు ఇంకా వరద నీటిలో మునిగి ఉన్నాయి. గణపవరం - చిలకలూరిపేట మార్గంలోని చప్టా పైనుంచి కుప్పగంజి వాగు ప్రవాహం కొనసాగింది. సాధినేని చౌదరయ్య హెల్త్ క్లబ్ సమీపంలో వరద నీరు జాతీయ రహదారిపై గురువారం కూడా నీరు పారుతూనే ఉంది.

● వినుకొండ టౌన్: మొంథా తుఫాను తాకిడికి మండలంలోని చీకటీగలపాలెం అడ్డరోడ్డు సమీపంలోని సుమారు 20ఎకరాల మేర వరి పంట నేలకొరగడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇదిలాఉండగా ఉమ్మడివరం గ్రామ సమీపంలో సుమారు 100ఎకరాల వరి పైరు నీటమునగడంతో పాటు విద్యుత్ బోర్లు సైతం నీటిలో మునగడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇదిలా ఉండగా తిమ్మాయపాలెం, నడిగడ్డ, కొప్పుకొండ, నీలగంగవరం గ్రామాల్లోని పొగాకు పంట వర్షం తాకిడికి నేలకొరిగింది.

● వినుకొండ టౌన్: మండలంలోని కొత్తపాలెంలో మొంథా తుఫాను తాకిడికి మూల బాలకోటయ్య, యాదగిరిలకు చెందిన టైలరింగ్ షాపు నేలకొరిగింది. వాగు ఒడ్డున గత కొంత కాలం క్రితం షెడ్ నిర్మించుకొని టైలరింగ్ షాపుతో వారు జీవనం సాగిస్తున్నారు. షాపు కింద నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో షాపు కింది భాగం ఒక్కసారిగా నేలకొరిగింది.

● శావల్యాపురం: మొంథా తుఫాన్ ధాటికి మండలంలో పలుచోట్ల రోడ్లు, చెరువులు మరమ్మతులకు గురయ్యాయి. వయ్యకల్లులోని ఊరచెరువుకు గండిపడడంతో నీరు ప్రక్కనున్న పొలాల్లోకి చేరింది. ఊరచెరువు ఆధారంగా 150ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. చెరువులోని నీరు పొలాల్లోకి చేరడంతో 20ఎకరాల్లో సాగుచేసిన వరిపంట నీట మునిగింది. పిచికలపాలెం ఎస్సీకాలనీలో పూరిళ్ళలోకి వర్షపునీరు రావడంతో పునరావాసకేంద్రానికి తరలించిన 4కుటుంబాలకు తహసీల్దార్ అర్జున్‌నాయక్, ఇన్‌చార్జి సర్పంచ్ గణపర్తి ఆంజనేయులు నిత్యావసరాలను అందజేశారు.

● రొంపిచర్ల: మండలంలోని గ్రామాలలో రెండు రోజుల నుంచి కురిసిన వర్షాలకు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. కాగా గురువారం నాటికి కొంత మేర నీటి ఉధృతి తగ్గింది. రాకపోకలు ప్రారంభమయ్యాయి.



వయ్యకల్లులో గండిపడ్డ ఊరచెరువు

ఉద్యాన పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

వినుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు ఆధ్వర్యంలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను బుధవారం పరిశీలించారు. వినుకొండ మండలంలో నరగాయపాలెం, కొత్తపాలెం, నూజెండ్ల మండలం వి.అప్పాపురం, మారెళ్ళవారిపాలెం పరిధిలో దెబ్బతిన్న మిరప పంటలు గుంటూరు లాంఫాం కీటక శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేంద్రరెడ్డి పరిశీలన చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి షేక్ నబీరసూల్, గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని మారెళ్ళవారిపాలెంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేస్తున్న మిర్చి పైరును జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటరావు గురువారం పరిశీలించారు. కార్యక్రంలో వినుకొండ ఉద్యానవన శాఖ అధికారి రసూల్, ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ వీ తిరుపతిరావు, ఐసీఆర్‌పీ రోసిరెడ్డి, వెంకాయమ్మ పాల్గొన్నారు. ముక్కెళ్ళపాడు, పువ్వాడ, తలార్లపల్లి, ములకలూరు రైతు సేవా కేంద్రాల పరిధిలో తుఫాన్ ధాటికి దెబ్బతిన్న పైర్లను వ్యవసాయ అధికారి ఆంజనేయులునాయక్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పరిశీలించారు.

● వినుకొండ: మండలంలోని తిమ్మాయిపాలెం చీకటీగలపాలెంలో పంట నష్టాన్ని ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ డీన్ చెరుకూరి శ్రీనివాసరావు పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వినుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ రవికుమార్, డాట్ సెంటర్ శాస్త్రవేత్తలు నగేష్, సత్యగోపాల్, తహసీల్దార్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానంలో మునిగిన సమాధులు

చిలకలూరిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జాతీయ రహదారి పక్కన పాత టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ఎదురుగా ఉన్న శ్మశానంలో (సమాధుల దొడ్డిలో) తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షంతో మోకాలు లోతున నీరు నిలిచిపోయింది. మునిసిపల్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



చిలకలూరిపేట శ్మశానంలో మునిగిన సమాధులు





కొత్తపాలెం సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి, ప్రవాహం తాకిడికి కూలిన రేకుల షెడ్

నిలిచిపోయిన గుండ్లకమ్మ బ్రిడ్జి పనులు

● వరద తాకిడికి కొట్టుకుపోయిన కంకర, ఇసుక, సిమెంటు

వినుకొండ టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపాలెం సమీపంలో గుండ్లకమ్మపై నూతనంగా నిర్మిస్తున్న ఓవర్ బ్రిడ్జి పనులు వర్షపు నీటి తాకిడికి ఆగిపోయాయి. మొంథా తుఫాను తాకిడికి గుండ్లకమ్మ ఉధృతంగా ప్రవహించడంతో బ్రిడ్జి సమీపంలో నిల్వ ఉంచిన 50లారీల ఇసుక, కంకర, 400 బస్తాల సిమెంటు నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాయి. ఇదిలా ఉండగా కూలీల కోసం బ్రిడ్జి సమీపంలో నిర్మించిన రెండు రేకుల షెడ్‌లు నేల కొరగడంతో కూలీలు నిలువ నీడ లేక లబోదిబోమంటున్నరు. సమాచారం తెలుసుకున్న గుత్తేదారులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని కూలీలకు పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పీపీపీని వ్యతిరేకిస్తూ వైసీపీ కోటి సంతకాల సేకరణ

శావల్యాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం చేపట్టిన పీపీపీ విధానాన్ని వ్యతిరేకిస్తూ వైసీపీ మండలకన్వీనర్ బోడెపూడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శావల్యాపురం సెంటర్లోని అంబేద్కర్ విగ్రహంవద్ద వైసీపీ నాయకులు గురువారం కోటి సంతకాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బోడెపూడి శ్రీను, ఎరుకలరెడ్డి, బొల్లా శివ, పొట్టిపాటి శ్రీను, ఏసురాజు, రాఘవరావు, గుర్రం గోవిందు, శివరామ్‌ప్రసాద్, పోతురాజు, కొండలు, సత్యం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

క్రీడాకారులకు బ్యాడ్మింటన్ కిట్ల పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

వినుకొండ, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ బాల్ బాడ్మింటన్ పోటీలలో రాణించి మెడల్స్ సాధించిన శావల్యాపురం మండలానికి చెందిన ఐదుగురు క్రీడాకారిణులకు బాల్ బ్యాడ్మింటన్ కిట్లను గురువారం స్థానిక ఎన్ఎస్‌పీ కాలనీ జడ్పీ హైస్కూల్‌లో బహూకరించారు. రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ వారు ఒక్కొక్కటి 5000 రూపాయల విలువ కలిగిన కిట్లను అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఏరువ వెంకట నారాయణ, కార్యదర్శి షేక్ బాజీ, కోశాధికారి పొత్తూరి నవీన్, క్లబ్ జిల్లా ముఖ్యులు అలా శ్రీనివాసరావు, చిరుమామిళ్ల కోటేశ్వరరావు, క్లబ్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలి

● వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరెడ్డి

గోనెపూడి (నరసరావుపేట రూరల్), అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా దెబ్బతిన్న మిరప, పత్తి, వరి, బొప్పాయి, అరటి పంటలకు రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారం రైతులకు అందజేయాలని వైసీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసరావుపేట మండలం గోనెపూడిలో మొంథా తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



నరసరావుపేట: గోనెపూడిలో మిరప పంటను పరిశీలిస్తున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

మాజీ మంత్రి రజిని పర్యటన

చిలకలూరిపేట, అక్టోబరు30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో గురువారం మాజీ మంత్రి విడదల రజిని పర్యటించి బాధితులను పరామర్శించారు. పట్టణంలోని సంజీవనగర్, తండ్రి సన్నిధి, సుగాలి కాలనీ, వీర ముష్టి కాలనీ,గణపవరం శాంతి నగర్, పసుమర్రు ఎస్టీ కాలనీలను సందర్శించి, ప్రజలు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాలను సందర్శించారు. నరసరావుపేటలో జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లాను ఆమె కలిసి బాధితులకు, రైతులకు సత్వర సహాయం అందచేయాలని వినతిపత్రం అందచేశారు. పొలాలలో తడిచి దెబ్బతిన్న పంటల మొక్కలను ఆమె కలెక్టరుకు చూపారు.

● నాదెండ్ల: తుఫాన్‌తో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం న్యాయం చేయాలని మాజీమంత్రి విడదల రజిని డిమాండ్ చేశారు. గురువారం ఆమె తూబాడు జంగాలపల్లి గ్రామాల పరిధిలో తుఫాన్‌తో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు.



కలెక్టర్ కృత్తికా శుక్లాకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ మంత్రి రజిని

గుంతలను తక్షణమే పూడ్చాలి: సీపీఐ

నరసరావుపేట రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రోడ్డులోని బ్రిడ్జి డౌన్ వద్ద ఉన్న గుంతలను తక్షణమే పూడ్చి, నీళ్ళని యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి ప్రజలకి అసౌకర్యాలు కలిగించకుండా చూడాలని సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో చిలకలూరిపేట బ్రిడ్జి కింద ఉన్నటువంటి బాబాపేట దగ్గర తుఫాను వల్ల పెద్ద గొయ్యి ఏర్పడిందని దానివల్ల నీళ్ల ఎటు పోయే పరిస్థితి లేదని వెంటనే నీటిని తొలగించాలనానరు. గుంతలను వెంటనే పూడ్చాలని నిరసన తెలిపారు. మున్సిపల్ అధికారులతో రోడ్లను మరమ్మతులు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు ఉప్పలపాటి రంగయ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు సీపీఐ నాయకులు అరుణ్ వెంకయ్య నాగేశ్వరావు మధు హేమంత్ నాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

చిలకలూరిపేట, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట చిలకలూరిపేట మార్గంలో కాపూరు వద్ద గురువారం ద్విచక్ర వాహనంపై వస్తున్న దంపతులను ఆటో ఢీకొట్టింది. ప్రమాదంలో నాదెండ్ల మండలం ఎడుగుంపాలెంకు చెందిన పిచ్చియ్య (55) ఆయన భార్య మరియమ్మ (50) తీవ్రంగా గాయపడ్డారు. 108 వాహన సిబ్బంది ప్రథమ చికిత్స చేసి చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం వారిని మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

● నాదెండ్ల: మండలంలోని కుప్పగంజి వాగు సమీపంలో వంజె మహేష్‌కు చెందిన సుమారు రూ.1.50లక్షలు గేదె పాము కాటుతో మృతి చెంది. పశు వైద్యాధికారి సాంబశివారెడ్డి పోస్టుమార్టం చేశారు. గేదె తమకు జీవనాధారం అని ప్రభుత్వం ఆదుకోవాలని మహేష్ విజ్ఞప్తి చేస్తున్నాడు.

● చిలకలూరిపేట: పట్టణంలోని జనవిజ్ఞానవేదిక కార్యాలయంలో గురువారం జనవిజ్ఞానవేదిక డివిజన్ సమావేశం జరిగింది. సమావేశంలో డాక్టర్ గేయానంద్ రచించిన జనవిజ్ఞానవేదిక ప్రచురించిన 'పీపీపీ పేరుతో మెడికల్ కాలేజీల ప్రవేటీకరణ వద్దు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు ఏవీ శివయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ కొల్లా రాజమోహన్‌రావు పాల్గొన్నారు. సమావేశంలో డాక్టర్ సుబ్బారావు, విన్సెంట్‌పాల్, ప్రతాపరెడ్డి, బుజ్జిబాబు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.